ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శుక్రవారం 18 జూలై 2025



వసతి.. దయనీయం

సంక్షేమం సమస్యల మయం

- ❖ అరకొర వసతులతో విద్యార్థుల ఇక్కట్లు
- ❖ ఉమ్మడి గుంటూరు జిల్లాలో అద్దె భవనాల్లోనే సగం హాస్టళ్లు
- ❖ ప్రభుత్వ వసతిగృహాల్లోని సమస్యలపై హైకోర్టు ఆగ్రహం

ఇదేమి వసతి..

హాస్టళ్లలో విద్యార్థులకు శుభ్రమైన తాగునీరు, పౌష్టికాహారం అందడం లేదు. బెడ్లు, బెడ్ షీట్లు, దిండ్లు కూడా లేవు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, బాత్ రూమ్‌లు లేవు. చాలాచోట్ల హాస్టల్ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ప్రభుత్వ వసతి గృహాల్లో కంటే పిల్లలు తల్లిదండ్రులు వద్ద ఉండడమే మేలు.

-హైకోర్టు ధర్మాసనం

చీరాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువు కుంటున్న విద్యార్థులకు సంరక్షణతో కూడిన ఆశ్రయం ఇవ్వాల్సిన సంక్షేమ వసతిగృహాలు దా రుణంగా ఉంటున్నాయి. కనీస సౌకర్యాలు లేని శిథిల భవనాల్లో.. అపరిశుభ్ర వాతావరణంలో విద్యార్థులు వసతి పొందాల్సి వస్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఉన్న హాస్టళ్లు సమస్యల వలయంలో ఉన్నాయి. హైకోర్టు ధర్మాసనం ఆదేశాలతో జిల్లా న్యాయసేవాధికార సంస్థలు పలు హాస్టళ్లను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలు, విద్యార్థుల అవస్థలపై నివేదిక సమర్పించాయి. ఈ పరిస్థితుల్లో హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల అవస్థలు తీర్చడంపై పాలకులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నా సంక్షేమ వసతిగృహాల్లో పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 70కి పైగా హాస్టళ్లలో పదివేల మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతూ చదువుకుంటున్నారు. అయితే వీటిలో సగం అద్దె భవనాల్లోనే ఉన్నాయి. గుంటూరు సహా తెనాలి, వినుకొండ, బాపట్ల, మంగళగిరి, మాచర్ల, సత్తెనపల్లి (మిగతా 6లో)



గుంటూరులో ఏఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న హాస్టల్

ఫిష్ ఆంధ్రా.. షాపులేవీ!

- జిల్లాలో 103 యూనిట్లు మంజూరు
- పట్టుమని పది కూడా మనుగడలో లేని వైనం
- వైసీపీ నేతల అనుచరగణం జేబుల్లోకి సబ్సిడీ సొమ్ము
- క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలనే డిమాండ్లు
- విస్తుపోయేలా మత్స్యశాఖ పనితీరు

స్థానికంగా ఉండే నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పన....మత్స్య ఉత్పత్తుల వినియోగం పెంచడం...తద్వారా ఎగుమతులపై ఆధారపడకుండా స్థానికంగానే డిమాండ్ సృష్టించడం.... ఇలా ఒకటేమిటి ఫిష్ ఆంధ్రా పథకం పేరిట గత ప్రభుత్వం చేసిన ప్రచారార్భాటం ఇది. కానీ ఆచరణలో జరిగింది వేరు. లబ్ధిదారుల ఎంపిక మొదలు రాయితీ డబ్బుల వరకు అన్నింటిలో వైసీపీ నేతలే చెప్పినట్లే నడిచింది తప్పితే పారదర్శకత అన్నమాటకు తావే లేకుండా ఫిష్ ఆంధ్రా పథకాన్ని ఓ ప్రహసనంలా మార్చేసింది.

పెద్దఎత్తున రొయ్యల వినియోగమంటూ గత ప్రభుత్వం గొప్పలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల దాదాపు 72 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉన్న జిల్లా ఇది, ఇక్కడ చేపలు, రొయ్యల వినియోగం ఎక్కడికక్కడ స్థానింగా పెద్దఎత్తున విక్రయాలు జరుగుతూనే ఉంటాయి. ఈ ప్రాంతంలో పనిగట్టుకుని చేపలు, రొయ్యల వాడకంపై ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఈ స్పృహ కూడా లేకుండా గత ప్రభుత్వం ఈ పథకం పేరిట చేసిన ఆర్భాటం అంతా ఇంతాకాదు. నిజంగా ఈ రంగంలో ఉన్నవారికి న్యాయం చేయాలనే చిత్తశుద్ధి గత పాలకులకు ఉంటే సరైన వేదిక లేకుండా విక్రయాలు జరిపి పొట్టపోసుకునే వారు వేలల్లో ఉన్నారు. వీరిలో మత్స్యకారులే కాదు అన్ని సామాజిక వర్గాలు ఉన్నాయి. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కూడా ఇదే విషయాన్ని పాలకులకు సూచించింది. కానీ ఇవేవీ చెవికెక్కించుకోక పోగా నేలవిడిచి సాము చేసిన చందాన ఫిష్ ఆంధ్రా మాల్‌ల పేరిట ఓ ప్రహసనానికే అప్పటి ప్రభుత్వం తెరలేపింది. అధికారుల పాత్రను నామ మాత్రం చేస్తూ లబ్ధిదారుల ఎంపికను తూతూ మంత్రంగా చేపట్టి 40 శాతం వచ్చే రాయితీ సొమ్మును ఎంచక్కా వైసీపీ నేతలే స్వాహా చేశారని అప్పట్లోనే పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఇక మాల్‌లు మొదలుకుని ఫిష్ పోస్టర్లకు వైసీపీ రంగులు వేసి ప్రచారం చేపట్టడం మరో ఎత్తు. మూడు కేటగిరీల్లో 103 షాపులను జిల్లాలో ఏర్పాటు చేసినట్లు గత పాలకులు ఊదరగొట్టడమే కాదు, హంగు, ఆర్భాటాలతో ప్రారంభోత్సవాలు చేశారు. సీన్ కట్ చేస్తే రొయ్యల వినియోగం గతం కన్నా పెరిగిందీ లేదు, ఉపాధి కల్పనా ఎండమావే, పట్టుమని పదిషాపులు కూడా ఇప్పుడు జిల్లాలో మనుగడ లేవు. రాయితీ సొమ్ము స్వాహా చేసిన నేతల అనుచరగణం దిలాసాగా ఉంటే, కోట్ల రూపాయలు ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం పాలైంది. గత ఏలుబడిలో ఇంత పెద్ద ఎత్తున జరిగిన కార్యక్రమానికి సంబంధించి మత్స్యశాఖ దగ్గర కనీసం ఏ ప్రాంతంలో ఎన్ని షాపులు ఏర్పాటు చేశారు? లబ్ధిదారులెవరూ అనే సమాచారం లేకపోవడం జరిగిన గోల్‌మాల్‌లో అప్పటి యంత్రాంగం పాత్రపైనా అనుమానాలు రేకెత్తించేలా ఉన్నాయి. ఈ ప్రభుత్వం కొలువుదీరిన కొత్తల్లో ఫిష్ ఆంధ్రా అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపడతామని ప్రకటించింది. ఇంతవరకు అతీగతీ లేదు. ఇప్పటికైనా ఆ పథకంలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ చేపడితే వైసీపీ నేతల స్వాహాకార్యాలు వెలుగు చూసే అవకాశం (మిగతా 6లో)



బాపట్ల పట్టణంలో ఏర్పాటు చేసిన ఓ ఫిష్ ఆంధ్రా షాపు పరిస్థితి ఇదీ

టౌన్‌హాలుది ఘన చరిత్ర

ఆర్డీవో గ్లోరియా

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నో సాహిత్య, సాంస్కృతిక కార్య



తెలుగుతల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి మాట్లాడుతున్న ఆర్డీవో గ్లోరియా

క్రమాలకు బాపట్లటౌన్ హాలు పట్టుగొమ్మగా నిలిచిందని ఆర్డీవో గ్లోరియా పేర్కొన్నారు. 120 వసంతాల టౌన్‌హాలు వార్షికోత్సవం గురువారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫోరం కార్యదర్శి డాక్టర్ పీ సీ.సాయిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలుగుతల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జాతీయ నాయకుల ప్రసంగాలకు సాక్షీభూతంగా నిలిచిందన్నారు. ఇది ఎందరో కవులు, కళాకారులకు ఆలంబనంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎవి.రమణారావు, రచయత మల్లికార్జున, విశ్రాంత ప్రిన్సిపాల్ కృష్ణంరాజు, అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ కలాం, రత్నేశ్వరరావు, మల్లేశ్వరి, సుశీలావతి, వెంకటలక్ష్మమ్మ, పద్మజ, విద్యార్థులు,న్యూస్ పేపర్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ రహదారికి ఆమోదం

- తోకపల్లి నుంచి పందిళ్లపల్లి వరకు నిర్మాణం
- మంత్రి గొట్టిపాటి ప్రతిపాదన.. సీఎం అనుమతి

అద్దంకి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పశ్చిమ, తూర్పు ప్రాంతాలను కలుపుతూ జాతీయ రహదారి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పెద్దారవీడు మండలం తోకపల్లి నుంచి దొనకొండ, దర్శి, అద్దంకి, చందలూరు, ఇంకొల్లు, కడవకుదురు, మోటుపల్లి మీదగా పందిళ్లపల్లి వరకు సుమారు 130.345 కి.మీ దూరం జాతీయ రహదారి నిర్మాణానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రతిపాదన చేశారు. దీనిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి గొట్టిపాటి తీసుకువెళ్లగా అంగీకరించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు గొట్టిపాటి తెలిపారు. పెద్దారవీడు మండలం కుంట వద్ద రెండు జాతీయ రహదారుల నుంచి ప్రారంభమై పురాతన విమానాశ్రయం దొనకొండ, అతి పురాతన బౌద్ధ స్థూపం ఉన్న చందవరం, చీరాల ప్రాంతాల్ని కలుపుతూ ఒంగోలు-దిగమర్రు జాతీయ రహదారిలో కలిసేలా జాతీయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. కుంట వద్ద ఉన్న రెండు జాతీయ రహదారులు, అద్దంకి సమీపంలోని నామ్ రోడ్డు, విజయవాడ-బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు, పాత మద్రాస్ రోడ్డు, ఒంగోలు-దిగమర్రు రోడ్డులను అనుసంధానం చేసేలా కొత్తగా ఏర్పాటు చేసే జాతీయ రహదారి ఉండనున్నది. దొనకొండ, దర్శి, అద్దంకి, చందలూరు, కొనికి,ఇంకొల్లు, కడవకుదురు ప్రాంతాల్లోని ఆర్‌అండ్‌బీ రోడ్లను విస్తరిస్తూ జాతీయ రహదారి నిర్మాణం చేసేలా ప్రతిపాదనలు చేశారు. అదే సమయంలో దర్శి అద్దంకిల్లో బైపాస్ రోడ్లు కూడా ఏర్పాటు కు అవకాశం ఉంది. జాతీయ రహదారి పట్టాలెక్కితే చీరాల, అద్దంకి, దర్శి ప్రాంతాల నుంచి శ్రీశైలం, కర్నూలు వెళ్లేందుకు దగ్గరి మార్గంగా ఏర్పడుతుంది.



దర్శి- అద్దంకి ఆర్‌అండ్ బీ రోడ్డు ఉమ్మడి ప్రకాశంలో పశ్చిమ, తూర్పు ప్రాంతాలను కలుపుతూ జాతీయ రహదారి

బగళాముఖి అమ్మవారి హుండీ ఆదాయం రూ.6.09 లక్షలు



హుండీ లెక్కిస్తున్న అధికారులు, పండితులు

పిట్టలవానిపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలోని హుండీలను తెరిచి భక్తులు సమర్పించిన కానుకులను గురువారం అధికారులు, అర్చకులు, భక్తుల సమక్షంలో లెక్కించారు. ఆలయంలో ఐదు హుండీలకు సంబంధించి 6 లక్షల 9వేల 886 రూపాయలు ఆదాయం లభించినట్లు త్రిముఖదేవాలయాల కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది. ఈ కార్యక్రమంలో చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్, హెడ్‌కానిస్టేబుల్ శివశంకరరావు, శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది కె.శ్రీనివాసరావు, నాగుల శ్రీనివాసరావు, రేపల్లె, చందోలు, భనవారిపాలెం గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ముస్తాబు



డైనింగ్ హాలు

- ప్రారంభానికి సిద్ధమైన భవన సముదాయం
- నెరవేరిన మెగా పీటీఎంలో సీఎం చంద్రబాబు హామీ
- మాట నిలబెట్టుకున్నాం.. మంచి ఫలితాలు సాధించాలని లోకేశ్ ట్వీట్



తరగతి గది



ముఖ్యమంత్రి చొరవతో ప్రారంభానికి సిద్ధమైన హైస్కూల్ భవనం

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది మెగా పేరెంట్ అండ్ టీచర్స్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. హైస్కూల్ లోని భవన నిర్మాణ పనులను గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టారని వైసీపీ హయాంలో ఐదేళ్ల నిర్లక్ష్యం చేశారు. గత ఏడాది డిసెంబరు 7న బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన పీటీఎం కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల దృష్టికి ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకెళ్లారు. పాత భవనంలోనే గదుల్లో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. దీంతో పనులు నిలిచిన భవన సముదాయాన్ని ముఖ్యమంత్రి పరిశీలించి పూర్తి చేయడానికి రూ.కోటి 49 లక్షలు మంజూరు చేశారు. దీంతో తరగతి గదులు, ల్యాబ్, డైనింగ్ హాలు వంటి వసతులతో హైస్కూల్ భవనాన్ని ఏడాదిలోనే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగులతో ముస్తాబు చేసిన భవనం అందర్నీ ఆకట్టుకుంటున్నది. త్వరలో దీనిని ప్రారంభించి విద్యార్థులకు అంకితం చేయనున్నారు. దీనిపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. మేమిచ్చిన మాట నిలబెట్టుకున్నాం.. మంచి ఫలితాలు సాధించి బాపట్ల మున్సిపల్ హైస్కూల్ పేరు నిలబెట్టాలని విద్యార్థులు, ఉపాధ్యాయులను కోరుతూ ట్వీట్ చేశారు.

ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

ఆర్ఎంపీలతో డీఎంహెచ్‌వో విజయమ్మ

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రోగులు, అనారోగ్య పీడితులకు ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ తెలిపారు. బాపట్ల ఎన్జీవో హోమ్‌లో గురువారం ఆర్ఎంపీలతో జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఆర్ఎంపీలు రోగులకు ఇంజక్షన్లు చేయరాదని, సెలైన్లు పెట్టరాదని, ఇతర వైద్యం చేయరాదన్నారు. ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేసి, వారిని సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు పంపించాలన్నారు. పరిధిని అతిక్రమించి వైద్యం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

ఆక్వా విస్తీర్ణం పెంపునకు ఆమోదం

జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్థిరమైన ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించటానికి, విస్తీర్ణం పెంచటానికి ఆమోదం తెలుపుతున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి ప్రకటించారు. ఈ విషయమై గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆక్వా ఉత్పత్తుల సాగు పెంచటానికి అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రస్తుతం 17,603.80 ఎకరాల విస్తీర్ణంలో ఆక్వాకల్చర్ సాగు జరుగుతుందని మత్స్యశాఖాధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో మరో 3067.16 ఎకరాలలో ఆక్వాకల్చర్ విస్తరింప చేయటానికి అనుకూలంగా ఉందని, అదేవిధంగా భవిష్యత్తు తరాలలో ఆక్వాకల్చర్‌ను విస్తరింప చేయటానికి 3,361.14 ఎకరాల భూమి అనువుగా ఉందని మత్స్యశాఖాధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఆక్వా సాగు విస్తరిసే, విదేశీ మారక ద్రవ్యం పెరుగుతుందని, తద్వారా జిల్లా జీడీపీ రేటు పెరుగుతుందని, రైతులకు జీవనోపాధి అవకాశాలు మెరుగుపడుతాయని కలెక్టర్ తెలిపారు. ఆక్వాజోన్ విస్తీర్ణతకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సభ్యులు తయారు చేసిన ప్రతిపాదనలను కలెక్టర్ ఆమోదించారు. సమావేశంలో మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాసనాయక్, ఉపసంచాలకులు గాలిదేముడు, చీరాల సహాయసంచాలకులు కృష్ణ కిషోర్, నిజాంపట్నం సహాయ సంచాలకులు సైదానాయక్, ఎఫ్‌డీవో కిషోర్‌రెడ్డి, జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్రఅధ్యక్షుడు డాక్టర్ అనంత నగేష్‌బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

తీరంలో భారీ వర్షం



నిజాంపట్నంరోడ్డు పల్లపట్ల సమీపంలో జలమయమైన రహదారులు

రేపల్లె, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలతో పాటు పలు రహదారులు జలమయమయ్యాయి. ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో రూ.8 వేలతో వెదలో వరి నాటిన రైతులు ఈ వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు. మొలకలు రావని భయాందోళన చెందుతున్న రైతులకు ఉపశమనం కలిగేలా వర్షం పడింది. ఈ వర్షంతో మొలకలు వస్తాయంటూ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జనగణనతోనే కులగణన చేపట్టాలి



బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న శంకరరావు

తెనాలి అర్బన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జనగణనతోనే కులగణన కూడా చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ ఎంపీ పి.సత్యనారాయణ సమక్షంలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారామ్ అహిర్‌కు వినతి పత్రం అందజేసినట్లు గురువారం తెలిపారు. అనాదిగా అన్యాయానికి, దోపిడికి గురవుతున్న ఓబీసీల సాధికారతకు కేంద్రానికి సిఫారసు చేయాలని కోరారు. మహిళ రిజర్వేషన్ చట్టానికి సవరణ చేయాలని. ప్రైవేట్ రంగంలో కూడా ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ప్రత్యేక మంత్రిత్వ శాఖను కేంద్రంలో ఏర్పాటు చేసి ఓబీసీ ప్లాన్ రూపొందించి నిధులు కేటాయించాలన్నారు. క్రిమిలేయర్ తొలగించి ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వాలని, ప్రత్యేక రక్షణ చట్టం చేయాలన్నారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు క్రాంతికుమార్, కేసన కోటేశ్వరరావు, విష్ణు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు..

రూ.58.27లక్షల ప్రాజెక్ట్ మంజూరు



ప్రాజెక్ట్ పత్రం అందజేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు (విద్య) జూలై 17 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ బయో టెక్నాలజీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలోని బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆర్.చరణ్ రాజకు న్యూఢిల్లీలో ఏఎన్ఆర్ఎఫ్, పీఎం ఈసీఆర్‌జీ (అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, ప్రైమ్ మినిస్టర్స్ ఎర్లీ కెరియర్ రీసెర్చ్ గ్రాంట్) నుంచి రూ.58.27 లక్షల ప్రాజెక్టు మంజూరైందని వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. " స్టడీ ఆఫ్ యాంటీ లీష్మానియల్ యాక్టివిటీ ఆఫ్ బయోయాక్టివ్ కాంపౌండ్స్ ఐసోలేటెడ్ ఫ్రమ్ సీడ్స్ ఆఫ్ కారికా పపాయా అగెన్స్ట్ లీష్మానియా డోనోవాని" అనే అంశంపై పరిశోధనకు గాను రాబోయే మూడేళ్లకు ప్రాజెక్ట్ గ్రాంటు మంజూరైందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆర్. చరణ్ రాజను విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు అభినందించారు.

20న 'ఔషధ నిరోధకత'పై సదస్సు

● తెలుగు రాష్ట్రాల నుంచి 700 మంది వైద్యుల రాక

● ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్ వెల్లడి



సీఎంఈ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నందకిషోర్, కల్యాణ్ చక్రవర్తి

గుంటూరు మెడికల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఔషధ నిరోధకత (యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్/ ఏఎంఆర్) తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా రూపు దాలుస్తోందని, దీనిపై తగిన నియంత్రణ చర్యలు చేపట్టకపోతే ఇది మరో కరోనా మహమ్మారిలా మారుతుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఐఎంఏ హాల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాంటీ బయోటిక్ ఔషధ నిరోధకతపై వైద్యుల్లో మరింత అవగాహన పెంచేందుకు ఐఎంఏ రాష్ట్ర శాఖ, క్లినికల్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ సొసైటీ (సిడ్స్) సంయుక్త ఆధ్వర్యంలో జూలై 20న గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి నిరంతర వైద్య విద్య కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం.నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సదస్సులో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 700 మంది వైద్యులు హాజరవుతున్నారని తెలిపారు. సిడ్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ సీఎంఈ కార్యక్రమంలో మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై వివిధ అంశాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పేరుగడించిన వైద్య నిపుణులు సునీత నర్రెడ్డి, విష్ణురావు, సుమితారాయ్, లక్ష్మీ వేము, విజయ్ ఎలదండి, అనూప్ వారియర్, హరిప్రియా రెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు. ఐఎంఏ గుంటూరు అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు, డాక్టర్ టి.సేవకుమార్, డాక్టర్ నీరెన్ ఆర్, డాక్టర్ డి.అమరలింగేశ్వరరావు, డాక్టర్ బి.సాయికృష్ణ సీఎంఈ పోస్టర్లను ఆవిష్కరించారు.



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి అభివాదం చేస్తున్న హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి

ఎన్టీఆర్ ఆదర్శప్రాయుడు

● చుండూరు మండలం వేటపాలెంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణ

● రాష్ట్ర హోంమంత్రి అనిత

కొల్లూరు, చుండూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు అందరికి ఆదర్శ ప్రాయుడని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. గురువారం బాపట్ల జిల్లా చుండూరు మండలంలో పెనుగుదురుపాడు గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం వేటపాలెం గ్రామంలో టీడీపీ నాయకులు రావూరి కృష్ణ ప్రసాద్ (బాబు) ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన ఎన్టీఆర్ భారీ కాంస్య విగ్రహాన్ని హోంమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి కోసం నాడు ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని, అప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తూ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధికి, పేద వారి సంక్షేమం కోసం ఎన్టీఆర్ చూపిన మార్గంలో చంద్రబాబు నడుస్తున్నారని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలంలో వ్యవస్థలను గాడిలో పెట్టి మళ్లీ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలోకి తీసుకు వెళ్లడంతో పాటు ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాటు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మలినేని'లో డిప్లమా తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న డీన్ డాక్టర్ రమేష్ బాబు

వట్టిచెరుకూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం డిప్లమా తరగతులు గురువారం ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ తమ కళాశాలపై పూర్తి విశ్వాసంతో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పేందుకు ముందుకు రావడం తమ నిబద్ధతకు నిదర్శనమన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకు ండా విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకుల నిరంతర కృషి ఉంటుందన్నారు. కళాశాల డీన్ డాక్టర్ పి.రమేష్ బాబు మాట్లాడుతూ టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో డిప్లమా స్థాయి నుంచి సబ్జెక్ట్ నేర్చు కోవడం ద్వారా బీటెక్ విద్య చాలా సులభతరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.ప్పారావు, డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, హెచ్‌వోడీ డాక్టర్ ఏఎస్‌కే చైతన్య, ఇన్‌చార్జ్ రవీంద్ర పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రా...షాపులేవీ!

(5వ పేజీ తరువాయి)

ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది

జిల్లాలో 103 యూనిట్లు...

ఫిష్ ఆంధ్రా మాల్స్‌ను మూడు కేటగిరీల్లో గత ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో ఒక్కోటి పది లక్షల విలువ కలిగిన యూనిట్లు 7 ప్రారంభించారు. ఇందులో జనరల్-5, ఎస్సీ-2 కేటాయించారు. ఇందులో జనరల్ కేటగిరీకి 40 శాతం సబ్సిడీ కాగా ఎస్సీలకు 60 శాతం రాయితీ అందించారు. ఒక్కో యూనిట్ రూ.1.75లక్ష విలువ కలిగినవి 93 ప్రారంభించగా జనరల్--56, ఎస్సీ--18, ఎస్టీలకు 19 కేటాయించారు. అదే విధంగా ఫిష్ వాల్యూ యాడెడ్ ఎంటర్‌ప్రైజెస్ కింద 50 లక్షల విలువ కలిగిన యూనిట్లను మూడు మంజూరు చేశారు. అన్నింటిల్లో కూడా జనరల్‌కు 40 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం రాయితీని ప్రభుత్వం అందించింది. దాదాపు రూ. 1.50 కోట్ల ప్రభుత్వ సొమ్ము రాయితీల రూపంలో అందింది. మత్స్యశాఖ దగ్గర ఈ సమాచారం తప్ప ఏ ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేశారు, కేటగిరీల వారీగా లబ్ధిదారుల వివరాలు లాంటివి ఏవీ అందుబాటులో లేకపోవడం మరింత విడ్డూరంగా ఉంది

దాదాపు అన్నీ మూతే...

ఇంత పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా షాపులు జిల్లాలో ఇప్పుడు ఎక్కడ ఉన్నాయని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉంది. దాదాపు 75 శాతం మూతపడగా, మరికొన్నింటిని వేరే అవసరాలకు వినియోగించుకుంటూ బోర్డు మాత్రం అదే కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ఆ పథకం అమలు తీరు తెన్నులపై లోతుగా విచారణ చేపడితే ప్రభుత్వ సొమ్మును అర్హత లేని వాళ్లు ఎంత దోచుకున్నారో బహిర్గతమయ్యే అవకాశాలు ఉన్నాయి.

నలుగురు ఏడీఏలకు పోస్టింగ్

గుంటూరు సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో 40 రోజులుగా పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఏడీఏ (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్)లపై రాష్ట్ర అధికారులకు ఎట్టకేలకు కనికరం కలిగింది. పోస్టింగ్ కోసం ఏడీఏల ఎదురు చూపు అనే శీర్షికన ఈ నెల 16న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఏడీఏ బోయపాటి రవి బాబును సత్తెనపల్లికి, ఏడీఏ మస్తానమ్మను క్రోసూరుకు, ఏడీఏ రమాదేవికి బాపట్ల శిక్షణా కేంద్రంలో పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పటివరకు క్రోసూరులో పనిచేసిన హనుమంతురావును పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి బదిలీ చేశారు.

56 పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● మిగిలిన పాఠశాలలకు త్వరలో సర్దుబాటు

గుంటూరు (విద్య) జూలై 17 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని కొన్ని మండలాల్లో మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులను నియమిస్తూ డీఈఓ సీవీ రేణుక ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రజ్యోతిలో గురువారం మూత బడిలు అనే శీర్షిక ఉపాధ్యాయుల కొరతపై ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. కొరత ఉన్న పాఠశాలల్లో 56 మంది మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు. వెల్దుర్తి, బొల్లాపల్లి, వినుకొండ, కారంపూడి తదితర ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు వెంటనే ఉపాధ్యాయులు విధుల్లో చేరాలని డీఈఓ స్పష్టం చేశారు. వెల్దుర్తిలోని కొన్ని పాఠశాలల్లో అసిస్ట్ ఆధ్వర్యంలో విద్యా వాలంటీర్లను నియమించినట్లు ఎంఈఓ ఎస్కే ఎండీ కాశీం వెల్లడించారు. గురువారం ఆయన మండలంలోని కొన్ని పాఠశాలల్లో విస్తృత తనిఖీలు చేశారు.

సామాజిక మాధ్యమాలపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న డాక్టర్ నారాయణ భరత గుప్తా

గుంటూరు (విద్య) జులై 17 (ఆంధ్రజ్యోతి): డిగ్రి స్థాయిలో విద్యార్థులు సామాజిక మాధ్యమాలపై అవగాహన ఉండాలని కళాశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత గుప్తా సూచించారు. సాంబశివపేట ప్రభుత్వ మహిళా కళాశాలలో జోన్ 3 డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్, విద్యార్థులకు గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి మాధ్యమాలు కలిగి ఉండటం ద్వారా విశ్వజనీన విజ్ఞానం తెలుసుకోవడంతో పాటు తమ ఆలోచనలు, జ్ఞానాన్ని స్నేహితులతో పంచుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఆర్ జ్యోత్స్న కుమారి, ఆర్జెడి డాక్టర్ పి.కళావతి, కాలేజీ ఎడ్యుకేషన్ అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ తులసి మస్తానమ్మ, ఓఎస్డీ డాక్టర్ ఏవి కవిత, అనంతపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మశ్రీ, వేర్ ఇస్ ఆగ్రో లిమిటెడ్ డిప్యూటీ డైరెక్టర్ జయ ప్రదీప్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ సిహెచ్ తులసి, బ్లాక్ బక్స్ సీఈవో టి.అనురాధ, జవహర్ నాలెడ్జ్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.అపర్ణ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల బెనిఫిషరీ నగదు తిరిగి ఇవ్వాలి

●జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి



జోసెఫ్ మోసిగంటి

పొన్నూరు టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చర్చిల మరమ్మతుల కోసం గతంలో పాస్టర్లు చెల్లించిన బెనిఫిషరీ నగదును ప్రభుత్వం తిరిగి చెల్లించాలని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి గురువారం కోరారు. 2018లో తూర్పు గోదావరి జిల్లాలో చర్చిల మరమ్మతుల కోసం ఒక్కో చర్చికి రూ.3 లక్షల చొప్పున 30 చర్చిలకు రూ.90 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బెనిఫిషరీ కాంట్రిబ్యూషన్ కింద 10 శాతం నగదును ప్రతి చర్చి నుంచి పాస్టర్లు రూ.30వేల చొప్పున ప్రభుత్వానికి మొత్తం రూ.9 లక్షలు చెల్లించారని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి చర్చిల మరమ్మతులకు కాంట్రిబ్యూటరీ నగదును చెల్లించినట్లు చెపాపరు. అప్పట్లో ఎన్నికల దృష్ట్యా వైసీపీ నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో చర్చిలకు ప్రభుత్వ నగదు చెల్లింపు ప్రక్రియ నిలిపివేశారని గుర్తుచేశారు. వైసీపీ వచ్చిన తరువాత ఈ సమస్యను పరిష్కరించలేదని ఆరోపించారు. జగన్మోహన్‌రెడ్డి ఎంత అన్యాయం చేసినప్పటికీ క్రైస్తవ సమాజం సొంత మనిషిగా అనుకోవడంలో అర్థం లేదన్నారు. జగన్ ప్రభుత్వంతో పోలిస్తే చంద్రబాబు పాలనలో క్రైస్తవ సమాజానికి మేలు జరిగిందన్నారు. పాస్టర్లు అప్పు చేసి చెల్లించిన కంట్రిబ్యూషన్ నగదు తిరిగి ఇప్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	104, 112, 123
చికెన్ విత్ స్కిన్(కిలో)	200.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	210.00

పలు మార్కెట్ కమిటీలకు చైర్మన్ల నియామకం



బెల్లంకొండ భారతి, మల్లీశ్వరి దంపతులు, షేక్ కరిముల్లా

దాచేపల్లి/మాచర్లటౌన్/చిలకలూరిపేట జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పలు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్లను గురువారం ప్రకటించింది. అందులో పల్నాడు జిల్లాలోని గురజాల, మాచర్ల, చిలకలూరిపేట మార్కెట్ యార్డులు ఉన్నాయి. గురజాల వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా దాచేపల్లి నగర పంచాయతీకి చెందిన బెల్లంకొండ భారతి నియామకమయ్యారు. బెల్లంకొండ భారతి 2012లో దాచేపల్లి పంచాయతీ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆమె భర్త బద్రి మండల టీడీపీ కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

● మాచర్ల మార్కెట్‌యార్డు చైర్ పర్సన్‌గా వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకురాలు రాజబోయిన మల్లీశ్వరిని ప్రభుత్వం నియమించింది. యాదవ సామాజిక వర్గానికి చెందిన రాజబోయిన మధుసూదన్ యాదవ్ వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి రాజబోయిన కుటుంబం ఆ పార్టీలో కొనసాగుతోంది. ఆయన భార్య మల్లీశ్వరికి పదవి ఇవ్వడంతో.. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డికి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు కృతజ్ఞతలు తెలిపారు.

● చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పట్టణానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు షేక్ కరిముల్లా ఎంపికయ్యారు. స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అనుచరుడుగా ఆయన కొనసాగుతున్నారు.

వసతి.. దయనీయం

(5వ పేజీ తరువాయి)

నరసరావుపేట తదితర ప్రాంతాల్లో కళాశాల, పాఠశాల స్థాయి హాస్టళ్లు అద్దెభవనాల్లోనే ఉన్నాయి. అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఉన్నా హాస్టళ్ల పర్యవేక్షణ సక్రమంగా సాగడం లేదు. కొంతమంది వార్డెన్లు వెల్ఫేర్ ఆఫీసర్లను మేనేజ్ చేసి విధులకు డుమ్మా కొడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా విద్యార్థుల సంక్షేమం గాలిలో దీపం అన్న చందంగా మారింది. అద్దె భవనాల్లో విద్యార్థులకు సరిపడినన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు వారికి ఇవ్వాల్సిన దుప్పట్లు కూడా సకాలంలో అందడం లేదు. ఏటా చలికాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వైద్య పరీక్షలు మరిచారు..

హాస్టళ్లలో వసతి పొందే విద్యార్థులకు కనీసం మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాల్సిన వైద్య పరీక్షలు గత కొన్నేళ్లలో జరిగిన దాఖలాలు లేవు. ఫలితంగా విద్యార్థులు చర్మ సంబంధ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు కలుషిత నీరు ఆహారం తీసుకుని విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నా పట్టించుకోవడం లేదు.

కాస్మోటిక్ చార్జీల కోసం ఎదురుచూపు

హాస్టళ్లలో విద్యార్థులకు ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలి. అయితే ఇవి సక్రమంగా అందడం లేదు. కొంతంగా సబ్బులు నూనెలు తదితర వస్తువులు సొంత డబ్బులతోనే కొనుగోలు చేసుకుంటున్నారు.

తూతు మంత్రంగా మెనూ

విద్యార్థులకు నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు చేయడం లేదు. ఫలితంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందని ద్రాక్షలాగా మారింది. గుంటూరులోని కొన్ని హాస్టళ్ల విద్యార్థులు సమీపంలోని అన్న క్యాంటీన్లలో భోజనం చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరికొందరు రైస్ కుక్కర్లను ఇళ్ల నుంచి తెచ్చుకొని హాస్టల్ గదుల్లోనే వంట చేసుకుంటున్నారు. ఇదంతా ఉన్నత స్థాయిలో అధికారులకు తెలిసిన చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

పిడుగుపాటుకు వృద్ధుడి మృతి

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పిడుగు పాటుకు వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఓలేరు శివారు గ్రామం వెంకటరాజు నగర్‌లో గురువారం చోటు చేసుకుంది. గుంటూరు లూర్దు మరియన్న (69) మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో దగ్గరలో ఉన్న వేప చెట్టు కింద తలదాచుకున్నాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వోలకు తెలియజేశారు.

దెబ్బతిన్న భవనం

వేమూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) జంపని గ్రామంలో పిడుగుపాటుకు భవనం దెబ్బతింది. ముస్లింపేటలోని షేక్ ఖాదర్‌వలి ఇంటిపై పిడుగు పడ్డది. భవనం పిట్టగోడలు, శ్లాబు కొంత భాగం వరకు దెబ్బతిన్నాయి. ఎలాంటి ప్రమాదం జరగలేదు.

36,922 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 35,268 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 36,922 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,521 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	10800
334	9500	13000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13400	334	9500	12800
273	----	-----	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	---	----
4884	---	----	341	10000	13800
సూపర్ 10	10000	13000	4884	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	----	----	బ్యాడిగి	10000	12700
బ్యాడిగి	10000	12300	దేవనూరు డీలక్స్	10000	12500
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4500	7000

బాపట్ల డిప్యూటీ ఎంపీడీవోగా రామకృష్ణ



బాపట్లరూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలప్రజాపరిషత్ డిప్యూటీ ఎంపీడీవోగా జి.రామకృష్ణ గురువారం బాధ్యతలు సేకరించి ఒంగోలు జిల్లాపంచాయతీ అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జి.రామకృష్ణ పదోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవోగా ఎంపికై బాపట్లమండలప్రజాపరిషత్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడివో బాబురావు, ఏవో చక్రధరరావు, పంచాయతీ కార్యదర్శులు ఆయనకు ఆహ్వానం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు.

బేతపూడి సొసైటీ చైర్‌పర్సన్‌గా రామకృష్ణారెడ్డి



బాపట్లరూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం బేతపూడి సొసైటీ చైర్‌పర్సన్‌గా తనను నియమించినట్లు గంపాల వెంకటరామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మార్కెట్‌యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో ఈ పదవీ రావటం ఎంతో సంతోషదాయకమన్నారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, పడమర బాపట్ల గ్రామ అధ్యక్షుడు సమ్మెట మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

బాపట్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని త్యాగరాయ్ నగర్‌కు చెందిన తురగా గాయత్రి నాగసబ్బలక్ష్మీని భర్త విజేంద్రతోపాటు అత్తమామలు, ఆడపడుచు వేధింపులకు గురిచేస్తున్నారంటూ గురువారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆర్ రాంబాబు తెలిపారు.

డబ్బులు అడిగినందుకు కత్తితో దాడి

బాపట్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్రావారి వీధికి చెందిన మేడా నాగరాజు పిన్నికొడుకు పాలపర్తి కిరణ్‌కు రూ.10వేలు అప్పు ఇప్పించాడు. నెలనెలా తిరిగి చెల్లించే పద్ధతిలో అప్పు తీసుకొని తిరిగి చెల్లించకపోవటంతో నాగరాజు డబ్బులివ్వమని అడగటంతో గొడవపడ్డాడు. నాగరాజును కత్తితో గాయపరిచాడని ఫిర్యాదు చేయటంతో పట్టణ ఎస్‌ఐ చంద్రావతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆర్ రాంబాబు తెలిపారు.

అనారోగ్యంతో అప్పారావు మృతి

కొల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో నర్రా అప్పారావు (85) బుధవారం రాత్రి కన్నుమూశారు. కొల్లూరుకు చెందిన అప్పారావు మహాప్రస్థానం అభివృద్ధికి విశిష్ట సేవలు అందించారు. కొంత కాలంగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఇంటికే పరిమితమయ్యారు. బుధవారం రాత్రి ఆయన కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, క్రాప పీఏసీఎస్ అధ్యక్షుడు కోగంటి హరి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

జీవో నెంబరు 22ఏను ఎత్తివేయాలి

● అలకాపురం, అల్లూరు రైతులు

పిట్టలవానిపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరు, అలకాపురం గ్రామాలకు చెందిన రైతుల భూములకు జీవో నెంబరు 22ఏను ఎత్తివేయాలని అలకాపురం గ్రామసభలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులతో తహసీల్దార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2008 నుంచి తమ భూములు వాన్‌పిక్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారని జీవో నెంబరు 22ఏ వల్ల పంటలు పండిస్తున్నప్పటికీ లబ్ధి చేకూరటంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరంగా రైతులకు అందించే ఎరువులు, పురుగుమందులతో పాటు ప్రభుత్వపరంగా వచ్చే పథకాలను నష్టపోతామని తహసీల్దార్‌కు వినతిపత్రంలో తెలియజేశారు. ఈవిషయాన్ని కలెక్టర్, ఆర్డీవో, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళతామని తహసీల్దార్ రైతులకు తెలిపారు. కార్యక్రమంలో అలకాపురం సర్పంచ్ మంతెన గంగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.ఏలీషాబాబు, ఆర్‌ఐ కె.శ్రీనివాసరావు, అల్లూరు వీర్వో వీరనాయుడు, వివిధ గ్రామాలకు చెందిన వీఆర్వోలు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛను అమలు చేయాలి

● ఆపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్

వేమూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛను అమలు చేయాలని బాపట్ల జిల్లా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసకుమార్ కోరారు. గురువారం ఆయన వేమూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, సీపీఎస్ అమలు తేది 2004, సెప్టెంబరు 1కి ముందే విడుదలైన నోటిఫికేషన్ ద్వారా నియామకం పొందినటు వంటి 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల కు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు 57 ప్రకారం పాత పెన్షన్ విధానం అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం 57 ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రం లో ముగ్గురు ఐఎఎస్ ఆఫీసర్లకు పాత పెన్షన్ అమ లు చేసిన గత రాష్ట్ర ప్రభుత్వం 2003 డీఎస్సీ ఉపా ధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేస్తామని తెలిపి కాలయాపన చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి కూడా అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ అదే దాటవేత ధోరణితో ఉండటం శోచనీయమన్నారు. పాత పెన్షన్ విధానం అమలు కోసం జూలై 18 రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నిరసన ప్రదర్శనలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. పాత పింఛను అమలయ్యే వరకు ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం పోరాడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చంద్రబాబుని చూస్తుంటే అభివృద్ధి, టెక్నాలజీ గుర్తుకొస్తాయి

● వేటపాలెం ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో హోం మంత్రి వంగలపూడి అనిత

చుండూరు (అమృతలూరు), జూలై 17 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబునాయుడు చూస్తుంటే అభివృద్ధి, టెక్నాలజీ గుర్తుకొస్తాయని, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. చుండూరు మండలం వేటపాలెంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అధ్యక్షతన జరిగిన సభలో హోంమంత్రి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు చూస్తుంటే అభివృద్ధి, టెక్నాలజీ గుర్తుకు వస్తాయని, జగన్మోహన రెడ్డి పేరు చెబితే గొడ్డలివేటు, గంజాయి, చర్లపల్లి జైలు గుర్తుకు వస్తాయని చెప్పారు. తల్లి, చెల్లిని రోడ్డు మీద పడవేసి ప్రెస్‌మీట్లు పెట్టి నంగనాచి కబుర్లు చెబుతున్నాడన్నారు. ముందు జగన్ ఆడవారిని గౌరవించడం నేర్చుకోవాలన్నారు. దేశంలోనే పెన్షన్లు పంపిణీ కోసం అత్యధికంగా ఖర్చు చేస్తున్న రాష్ట్రం మనదేనని, రూ.4 వేలు నుంచి రూ.15 వేలు వరకు పింఛన్లు పంపిణీ ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు పూర్తి కావస్తుందని, రాజధాని లేని రాష్ట్రంగా మనకు అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేసి చంద్రబాబు చూపిస్తున్నారన్నారు. సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం



తల్లికి వందనం ఖాతాల్లో జమయ్యిందా అని విద్యార్థినులను అడుగుతున్న హోంశాఖ మంత్రి అనిత

అందించిన సుపరిపాలన గురిం చి ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేం ద్రప్రసాద్ మాట్లాడుతూ పేదలకు కూడు, గూడు, గుడ్డ కల్పించేందుకు అన్న ఎన్టీఆర్ టీడీపీ స్థాపించారని, బడుగు వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమంతో పాటు మౌలిక వసతుల కల్పనకు ఆయన కృషి చేశారని, 30 ఏళ్లగా ఆయన బాటలో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ప్రతిష్టను కాపాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం కష్టపడుతూనే ఉన్నారన్నారు. యువనేత నారా లోకేశ్ కూడా తండ్రికి తగ్గ తనయుడిగా టెక్నాలజీ, అభివృద్ధికి పాటు పడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 20లక్షల ఉద్యోగాలకు శ్రీకారం చుట్టారన్నారు. పెనుగుదురుపాడు, వేటపాలెం గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరిస్తూ కరపత్రాలను హోంమంత్రితో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, మండల అధ్యక్షులు తమ్మా శివారెడ్డి, సొసైటీ అధ్యక్షులు ఎల్లారెడ్డి, బాలకోటిరెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, వివిఎస్‌కె ప్రసాద్, కావూరి కృష్ణప్రసాద్, వెంకటరెడ్డి, శ్రీను నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పూలవర్షం కురిపించిన మహిళలు

హోంశాఖ మంత్రి అనితకు మహిళలు ఘన స్వాగతం పలికారు. చుండూరు మండలం దుండిపాలెం నుంచి ఎమ్మెల్యే ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో హోంమంత్రి అనితను టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేటపాలెం వరకు భారీ ర్యాలీతో తోడ్కొని వచ్చారు. మధ్యలో యడ్లపల్లిలో ఆగి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి పెనుగుదురుపాడులో పర్యటించారు. అడుగడుగునా మహిళలు పూల వర్షంతో స్వాగతించారు. పాదయాత్రలో మహిళలను అప్యాయంగా పలుకరించి వారి కోరిక మేర కు సెల్ఫీలు దిగారు. విద్యార్థులను కలుసుకుని తల్లికి వందనం నగదు అందిందా అంటూ అప్యాయంగా పలుకరించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాదయాత్ర ఆసాంతం మంత్రికి మహిళలు నిరాజనాలు పలికారు.

విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి
● ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణపై అధికారులతో సమీక్ష

బాపట్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లోని విద్యార్థుల చదువులు మెరుగుపడాలి, వారిసంక్షేమమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగుల సంక్షేమ ప్రభుత్వ వసతి గృహాల నిర్వాహణపై ఆ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ గురువారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాల్లోని విద్యార్థుల ఉన్నతమైన భవిష్యత్తుకు పునాదులు వేయాలని చెప్పారు. వారి చదువుల కోసం ప్రభుత్వం వెచ్చిస్తున్న నిధులు వృధా కారాదన్నారు. విద్యార్థుల సంరక్షణ బాధ్యత సంక్షేమాధికారులదేనన్నారు. ఏఎస్‌డబ్ల్యూవోలు, ఏబీసీ డబ్ల్యూవోలు ప్రతిరోజు ఒక వసతి గృహాన్ని విధిగా తనిఖీ చేయాలన్నారు. జిల్లా సంక్షేమ శాఖాధికారులు వారంలో మూడు వసతి గృహాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. 25 ఎస్సీ సంక్షేమ వతిగృహాల్లో 1474మంది విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. అదేవిధంగా జిల్లాలోని 10 ఎస్టీ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో 779మంది విద్యార్థులుండగా, 27 బీసీ వసతి గృహాల్లో 827 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. విద్యార్థుల హాజరు, ఎఫ్‌ఆర్ఎస్ వివరాలు ప్రతిరోజు కలెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. నెలలో రెండు రోజులు వసతి గృహాలను వైద్యాధికారులు పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ సంక్షేమ సాధికారత జిల్లా అధికారి జె.రాజాదెబోరా, బీసీ సంక్షేమ అధికారి శివలీల, ఎస్టీ సంక్షేమశాఖాధికారి ప్రకాశరావు, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ సువార్త, సహాయ సంక్షేమాధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

కలెక్టర్‌కు దళితనాయకుల సన్మానం

చీరాల కుప్పడం చీర ద్వారా జాతీయ అవార్డు అందుకున్న కలెక్టర్ జె.వెంకటమురళిని గురువారం కలెక్టరేట్‌లో దళిత సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుదే రాజారావు, మాలమహానాడు రాష్ట్ర అధికారప్రతినిధి శీలం రోజన్‌బాబు, ఆనంద్‌బాబు, ఏపూరి జోసఫ్, రవికుమార్, అనీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబు

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విజన్ కలిగిన నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయాలను ప్రతిఒక్కరు ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పిలుపునిచ్చారు. పట్టణంలోని 18, 31, 32 వార్డుల్లో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా వార్డుల్లో కమిటీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో పాల్గొని ప్రసంగించిన అనంతరం ఇంటింటా తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గురించి వివరించారు. నమ్మకమైన నాయకులు రాష్ట్రాన్ని పాలిస్తే పెట్టుబడులు వస్తాయన్నారు. తద్వారా రాష్ట్రం బాగుంటుందని యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆర్థికవనరులు పెరుగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. పీ-4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. పేద కుటుంబాలను దత్తతు తీసుకొని వారికి ఉపాధి అవకాశాలు కల్పించటంతోపాటు వారి పిల్లల చదువులకు సాయం చేయాలన్నారు. అదేవిధంగా వారికి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా చూడాలన్నారు. తద్వారా వారు ఆర్థికంగా స్థిరపడుతారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు బొంతు శివసాంబిరెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతాజయప్రకాష్ నారాయణ, పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, నాయకులు అల్లంగోపి కృష్ణ, బుర్లె రామసుబ్బారావు, పరీద్‌మస్తాన్, జి.గిరిజారాణి, చేజర్ల సతీష్, బూర్లె రామసుబ్బారావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని 18వవార్డులో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

పేదరిక నిర్మూలనే పీ-4లక్ష్యం : ఎంపీడీవో

బాపట్లరూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలనే పీ4లక్ష్యమని బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పీ-4 మార్గదర్శకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు ఆర్థికంగా సాయంతో పాటు అన్నిరకాలుగా సలహాలు, సూచనలిస్తూ ప్రోత్సహం అందించటమే మార్గదర్శకుల లక్ష్యమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకానికి ప్రజల భాగస్వామ్యం ప్రధానమని పబ్లిక్, ప్రైవేట్ రంగానికి సంబంధించిన సంస్థలు, వ్యక్తులు క్రియాశీలక పాత్ర పోషించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జి.రామకృష్ణ, పరిపాలనాధికారి చక్రధర్, అన్ని గ్రామాల మార్గదర్శకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాబురావు

● కర్లపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారు కుటుంబాల అభ్యున్నతికి ప్రతిఒక్కరు పాటుపడాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బంగారు కుటుంబాలపై మార్గదర్శకులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డీటీ శ్రీదేవి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ రమేష్, మండల వ్యవసాయాధికారి సుమంత్, ఏపీవో శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను తక్షణమే ఆపాలి

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగయ్య

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను తక్షణమే ఆపాలని బిగించిన మీటర్లను వెంటనే తొలగించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. ఈ విషయమై పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయం నందు సీఐటీయూ జిల్లా నాయకులు కె.శరత్ అధ్యక్షతన విద్యుత్ భారాలపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి గంగయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వినియోగదారులపై ట్రూఅప్ ఛార్జీలు, ఇంధనం సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కరెంట్ భారంపై ప్రజావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేది వరకు మండల, పట్టణాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించి ఇంటింటికి ప్రచారం, సంతకాల సేకరణ చేయాలని ఆగస్టు 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద ఆందోళన చేయాలన్నారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నాయకులు ప్రొఫెసర్ విజయ్‌కుమార్, ప్రజాసంఘాల జిల్లానాయకుడు టి.కృష్ణమోహన్, కె.కొండయ్య, కెశరత్,టి.సుభాషిణి, స్పందన తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, జూలై 17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అధ్యక్షుడు డి.ప్రభాకరరావు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టి ంచుకోకపోవటం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలన్నారు.

జిల్లాలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధం

● రేపటి నుంచి అమలు : కలెక్టర్

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బాపట్లను ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చాలనే లక్ష్యంతో ఈనెల 19వ తేదీ నుంచి సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఈ విషయమై గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నట్లు స్పష్టం చేశారు. దీనిపై డంపింగ్‌యార్డులో అవగాహన సదస్సు, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 2వేల మంది పాల్గొంటారన్నారు. మరో 1000మంది అధికారులు, ప్రజలు పాల్గొని ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేస్తారన్నారు. ప్రతిప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నుండి 10వ తరగతి పైబడిన 200మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. ఈ సమగ్ర నిషేధం ద్వారా బాపట్ల జిల్లాలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించి స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించటమే లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రజలందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన యువమోర్చ నేత

బాపట్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను గురువారం బీజేపీ యువమోర్చ రాష్ట్ర కోశాధికారి బి.కృష్ణచైతన్య మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లి పార్టీ ఆఫీస్‌లో మంత్రి లోకేశ్‌ను కలిసిన ఆయన ఉపాధ్యాయుల సమస్యలు గురించి వివరించారు. సమస్యల పరిష్కారంపై మంత్రి సానుకూలంగా స్పందించారు.



మంత్రి లోకేశ్‌తో యువమోర్చ రాష్ట్ర కోశాధికారి కృష్ణచైతన్య

ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ



ప్రపత్త్యాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న ఎంఎస్ సాఫ్ట్‌వేర్ అధినేత ఎం శేషుకృష్ణ

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూర్యలంక రోడ్డులో ఉన్న ప్రసిద్ధిగాంచిన శ్రీసువర్చల సమేత శ్రీప్రపత్త్యాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి గురువారం దాతలు పెద్ద సంఖ్యలో విరాళాలు అందజేశారు. ఎంఎస్ సాఫ్ట్‌వేర్ అధినేత ఎం శేషుకృష్ణ దంపతులు రూ.25,116లు అందజేశారు. అదేవిధంగా కోట బాలమేఘన తేజస్విని రూ.10,116లు, తటవర్తి ప్రతాప్‌కుమార్ ఝాన్సీరాణి దంపతులు రూ.10,116లు, కొత్రా రవీంద్ర రాజ్యలక్ష్మీ దంపతులు రూ.10,010లు, ఎస్ నాగభూషణం నాగమల్లేశ్వరి దంపతులు రూ.1,01,116లు, చాపల సుబ్రహ్మణ్యం సీతా ప్రవీణ దంపతులు రూ.25,116లు చొప్పున ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ విధంగా ఆలయ నిర్మాణానికి దాతలు సాయం చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాపినేని ప్రసాద్, అప్సర చిన్న తదితరులు ఉన్నారు.

అక్రమ కేసులపై పునఃపరిశీలన చేయాలి

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమ కేసులపై పునఃపరిశీలన చేయాలని కోరుతూ వైసీపీ నాయకులు గురువారం ఎస్పీ తుషార్‌డూడికి వినతిపత్రం అందజేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి మేరుగ నాగార్జున, నియోజకవర్గాల సమన్వయ కర్తలు కోన రఘుపతి, వరికూటి అశోక్‌బాబు, డాక్టర్ ఈవూరి గణేష్‌లతోపాటు పలువురు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలురెడ్డి, కోకి రాఘవరెడ్డి, జోగి రాజా, గవిని కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

కష్టపడే వారినే పదవులు వరిస్తాయి

● ఎమ్మెల్యే ఆనందబాబు ● పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్స్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న పెదపూడి పీఏసీఎస్ చైర్మన్ దేవకుమార్, డైరెక్టర్స్

అమృతలూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడి పనిచేసేవారినే పదవులు వరిస్తాయని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. గురువారం మండలపరిధిలోని పెదపూడి పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్స్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు మట్లపూడి జయపాల్ అధ్యక్షత వహించారు. సభలో ఆనందబాబు మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు అనుభవించిన కష్టాలు అన్నీ ఇన్నీ కావన్నారు. జగన్ పాలనతో ప్రజలు విసిగిపోయి కూటమికి అఖండ మెజారిటీ ఇచ్చారన్నారు. ప్రజలకు అనుగుణంగా చంద్రబాబు పాలన చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఆలోచనలు చాలా దూరదృష్టితో ఉంటాయన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు వంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక సహకార సంఘాల సేవలను రైతులు ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం చైర్మన్‌గా కొసరాజు దేవకుమార్, సభ్యులుగా పెదపూడి వీరయ్య, జూటూరి తిరుపతిరావులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పార్టీ మండ లాధ్యక్షుడు క్రొత్తపల్లి రవీంద్రబాబు, వేమూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, కూచిపూడి నీటిపారుదలశాఖ డీసీ కొరటాల లీల సత్యసాయి, వీఎస్‌కే ప్రసాద్, యలవర్తి బ్రహ్మానందం, శరణుగిరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని సత్కరించారు.

అధికారం ఉన్నా లేకపోయినా ప్రజాసేవకులమే

అమృతలూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా లేకపోయినా మేము ఎప్పుడూ ప్రజా సేవకులమే అని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండలపరిధిలోని పెదపూడిలో గురువారం సుపరిపాలన-తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులకు చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా చేసిన సంక్షేమం ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, పార్టీ మండలాధ్యక్షుడు క్రొత్తపల్లి రవీంద్రబాబు, స్థానిక, మండల స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో బాపట్ల జిల్లా ముందంజ

● వీక్షణ సమావేశంలో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్యం నిర్వహణలో బాపట్లకు అగ్రస్థానం లభించింది. రాష్ట్రవ్యాప్తంగా ముందు వరుసలో నిలిచిందని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ వెల్లడించారు. అన్నిజిల్లాల కలెక్టర్‌లతో అమరావతి నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రణాళిక, కార్యాచరణ నివేదికలో బాపట్ల 79శాతం సాధించిందని ఆయన తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ బాపట్ల జిల్లా యంత్రాంగం, సిబ్బంది, ప్రజల సమ ష్టి కృషి ఫలితంగా ఈ స్థాయికి వచ్చామని చెప్పారు. అధికారులను కలెక్టర్ అభినందించారు. నూరుశాతం స్వచ్ఛ బాపట్ల జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు పూర్తిస్థాయిలో పనిచేయాలని ఆయన కోరారు.

సొసైటీ అధ్యక్షుడు చింతలసుబ్బారావు ప్రమాణ స్వీకారం




నగరం నూతన సొసైటీ అధ్యక్షుడు చింతల సుబ్బారావును సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, జడ్పీటీసీ సభ్యులు, రైతులు

నగరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): నగరం సహకారసంఘం సొసైటీలో వైసీపీ పాలనలో జరిగిన అవినీతిని బయటకు తీయాలని మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య నూతన అధ్యక్షుడు అయినటువంటి చింతల సుబ్బారావుకు సూచించారు. నగరం పీఏసీఎస్ నూతన అధ్యక్షుడిగా చింతల సుబ్బారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వీరయ్య మాట్లాడుతూ సహకారసంఘం సొసైటీ రైతుల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కానీ గత పాలనలో సొసైటీలో భారీ కుంభకోణాలు చేశారని ఆరోపించారు. సొసైటీ అభివృద్ధితోపాటు అవినీతి చేసిన వారి జాబితా బయటకు తీయాలని సూచించారు. సంగం డెయిరీ డైరెక్టర్ నర్రా వెంకటకృష్ణప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధి పథంలో నడుస్తున్న నగరం పీఎసీఎస్‌ను కోలుకోలేని స్థితికి తెచ్చిన ఘనత వైసీపీదేనన్నారు. కోట్లలో అవినీతి జరిగిందని ఇక్కడ జరిగిన లావాదేవీలు బయటకు తీసి మంత్రి దృష్టికి తీసుకువచ్చి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నూతనంగా ఎన్నికైన చింతల సుబ్బారావు మాట్లాడుతూ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆశీస్సులతో నాకు ఈపదవి లభించిందని మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారికి కావాలసిన వ్యవసాయ రుణాలు, ఎరువులు సకాలంలో అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మత్తి భాస్కరావు, బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్, జడ్పీటీసీ సభ్యురాలు నాగమణి, మాజీ ఎంపీటీసీ సభ్యులు మేకా వెంకట శివరామకృష్ణ, డైరెక్టర్లు పమిడిపాముల వీరయ్య, తొలిచూరి నాగరాజు, లుక్కాగుడారంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సొసైటీ అధ్యక్షుడు బుల్లియ్య కృతజ్ఞతలు

కర్లపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతాయపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన అధ్యక్షుడిగా పేరలి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఎం బుల్లియ్యను సొసైటీ అధ్యక్షుడిగా నియమించినందుకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను బుల్లియ్య గురువారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. బుల్లియ్యను ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రవర్మ దుశ్శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుంచాల శివనాగిరెడ్డి, మాడా శ్రీనివాసరావు, శంకర్, మీరావలి, దామర్ల సురేష్, రావిరాంబాబురెడ్డి, శవనం శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, మల్లారపు వీరయ్య, నక్కల శేషాద్రి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నరేంద్రవర్మకు కృతజ్ఞతలు తెలుపుతున్న చింతాయపాలెం సొసైటీ అధ్యక్షుడు ఎం బుల్లియ్య

పొగాకు కొనుగోలు చేయటం హర్షణీయం

● బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మోహన్‌గౌడ్

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నల్లబర్లి పొగాకు కొనుగోలు చేస్తూ గిట్టుబాటు ధర కల్పిస్తున్నందుకు ప్రభుత్వానికి బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జీవీఎల్ మోహన్‌గౌడ్. కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మార్క్‌ఫెడ్ డీఎం తరుణశ్రీని నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న ఉత్పత్తులు మొత్తం కొనుగోలు చేయాలని కోరారు. ఈ మేరకు ఆమెకు వినతిపత్రం అందజేశారు. రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తం కొనుగోలు చేస్తామని డీఎం హామీనిచ్చారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

లాభసాటి సాగే లక్ష్యం

- ఆధునిక వ్యవసాయంతో రైతులకు ఆదాయం
- అన్నదాతలకు ఉపయోగ పడేలా కిసాన్ మేళాలు
- నడికూడి మార్కెట్ యార్డులో ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి



తక్కువ నీటితో పిచికారి విధానాన్ని పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యే యరపతినేని



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి గొట్టిపాటి..

దాచేపల్లి, పిడుగురాళ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి వ్యవసాయం లాభసాటి అనే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. దాచేపల్లి మండలంలోని నడికూడి మార్కెట్ యార్డులో గురువారం జరిగిన కిసాన్‌మేళాలో పాల్గొన్న మంత్రి ప్రసంగించారు. ఒక్క గురజాల రైతులకే పరిమితం కాకూడదని రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి కిసాన్ మేళాలు నిర్వహించాలన్నారు. ఖర్చులు తగ్గించుకుని అధునాతన వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులకు కిసాన్ మేళాలు ఉపయోగపడతాయన్నారు. ఒకప్పుడు వ్యవసాయంతో వచ్చే ఆదాయంతో పొలాలు కొనుగోలు చేసేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని నష్టాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు సంక్షేమమే ధ్యేయంగా కాల్వల ఆధునికీకరణ, వ్యవసాయ యాంత్రిక పరికరాలను రాయితీతో రైతులకు అందిస్తుందన్నారు. మన దగ్గర పండే పంట ఉత్పత్తులను మన ప్రాంతంలోనే కాకుండా దేశం నలుమూలలా అందినప్పుడే రైతు లాభాల బాటలో ఉంటాడన్నారు. నల్లబర్లీ పొగాకు చివరి ఆకు వరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

వైసీపీ వాళ్లలా చేయొద్దు : ఎంపీ లావు



గతంలో వ్యవసాయ అధికారులు ఏదో మమ అనిపించేలా చేశారని, ఇప్పుడు అలా చేయకుండా ఏ పనిచేసినా రైతులకు ఉపయోగపడేలా చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. వారానికి మూడు నాలుగు సార్లు పురుగు మందుల వాడకాన్ని రైతులు తగ్గించాలన్నారు. విత్తన ఎంపిక నుంచి పంట అమ్ముకునే వరకు రైతులు పడుతున్న ఇబ్బందులను తగ్గించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. పంట పండించడం, ఆ పంటను విక్రయించుకోవడం మధ్య రైతులు ఎంతో నలిగిపోతున్నారన్నారు. కిసాన్ మేళాలను అమరావతి, నరసరావుపేట, వినుకొండ ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేయాలన్నారు.

వైసీపీ పాలనలో నిర్లక్ష్యం: ఎమ్మెల్యే యరపతినేని



గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురైందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సాగు ఖర్చులు తగ్గించి అధిక లాభాలు పొందేలా కిసాన్ మేళాలు ఉపయోగపడతాయన్నారు. రైతులు బాగున్నప్పుడే దేశం, రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఆదాయంతో పాటు ఆరోగ్యాన్ని తెచ్చిపెడుతుందన్నారు. చివరి భూములకు సాగునీరు అందించేందుకు మేజర్, మైనర్ కాల్వల ఆధునికీకరణ పనులు చేస్తున్నామన్నారు. రైతులు బాగుండాలి, ఖర్చులు తగ్గించుకోవాలి, ఉత్పత్తులు పెరగాలి. అనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా సదస్సులు : కలెక్టర్ అరుణ్‌బాబు



వాతావరణాన్ని బట్టి సాగు చేసేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఆధునిక పద్ధతులతో ఖర్చులు తగ్గించుకునేలా రైతులకు సూచించాలన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు మాట్లాడుతూ పల్నాడులో వ్యవసాయంతోనే రైతుల జీవన విధానం ముడిపడి ఉందన్నారు. సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఖర్చులు తగ్గించి అధిక ఉత్పత్తులు సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో..
నేడు సీఎం చంద్రబాబు పర్యటన

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

గుంటూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నీరుకొండ గ్రామంలో ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో శుక్రవారం జరగనున్న గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ - 2025 ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహాతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. సీఎం కార్యక్రమ సభా స్థలి, సీటింగ్, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం, మీడియా గ్యాలరీ ఏర్పాట్లను పరిశీలించారు. యూనివర్శిటీ 3వ అంతస్థులో రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులతో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమానికి సంబంధించి సౌండ్ సిస్టమ్ ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం యూనివర్శిటీ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌ను సందర్శించారు. యూనివర్శిటీ అధికారులను సమన్వయం చేసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.నారాయణ రావు, ప్రో-వైస్ చాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్ అధికారులున్నారు. పాల్గొన్నారు.

నల్ల బర్లీ కొనుగోళ్లకు..
అదనపు సెంటర్ల పరిశీలన

గుంటూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్తగా నల్లబర్లీ కొనుగోలు సెంటర్‌లు ఏర్పాటు చేసేందుకు గురువారం ఏపీ మార్క్‌ఫెడ్ గుంటూరు జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి, పల్నాడు జిల్లా మేనేజర్ మురళీకృష్ణోర్, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం సత్తెనపల్లి, నాదెండ్ల మండలం గణపవరం ప్రాంతాల్లో పర్యటించారు. సత్తెనపల్లి ఏఎంసీ, సీడబ్ల్యూసీ, నాదెండ్ల మండలం గణపవరం గ్రామ పరిధిలోని ప్రైవేటు గోదాములను పరిశీలించారు. సాధ్యమైనంత వరకు ఎక్కువ మంది రైతులకు రోజువారీ షెడ్యూలింగ్ చేసే అవకాశం కల్పించి, త్వరితగతిన కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ముగిసిన ఏఎన్‌యూ ఐసెట్

●19న ఫలితాలు విడుదల ● 21న ప్రవేశాలు

పెదకాకాని, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జనరల్ ఎంబీఏ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఎంబీఏ హెచ్ఆర్ఎం కోర్సులలో సెల్ఫ్ సపోర్టింగ్ కేటగిరి సీట్ల భర్తీకి గురువారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష విజయవంతంగా ముగిసిందని ఏఎన్యూ పీజీ ప్రవేశాల సంచాలకులు ఆచార్య పి.బ్రహ్మజీరావు గురువారం తెలిపారు. ప్రవేశ పరీక్షకు 119 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 100 మంది హాజరయ్యారని చెప్పారు. ప్రవేశ పరీక్ష ఫలితాలను ఈ నెల 19న విడుదల చేస్తామని, ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 21వ తేదీ నుంచి ప్రవేశాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రవేశాలకు వచ్చే విద్యార్థులు డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, మార్కుల జాబితాలు, టీసీతో పాటు ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లతో విశ్వవిద్యాలయంలోని పీజీ ప్రవేశాల కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

23న ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష

ఏఎన్యూ ఇంజనీరింగ్ కళాశాలలో డ్యూయల్ డిగ్రీ విధానంలో బీటెక్ కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ కోర్సులలో సెల్ఫ్ సపోర్టింగ్ కేటగిరి సీట్ల భర్తీకి ఈ నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు ఆచార్య పి.బ్రహ్మజీరావు తెలిపారు. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు 200కు పైగా దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. సెల్ఫ్ సపోర్టింగ్ కేటగిరీ సీట్లలో ఆయా కోర్సులలో ప్రవేశం పొందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదని తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని విశ్వవిద్యాలయంలోని తమ కార్యాలయంలో నేరుగా సంప్రదించి పొందవచ్చన్నారు.

ముగిసిన జడ్పీటీసీ, ఎంపీపీల శిక్షణ

గుంటూరు సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మూడు రోజులు కొనసాగిన మహిళా జడ్పీటీసీ, ఎంపీపీ శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. కార్యక్రమాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ప్రారంభించారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళా ప్రజా ప్రతినిధుల పాత్ర, విధులు, బాధ్యతలు, గ్రామసభ, విధానాలు, భావవ్యక్తీకరణ నైపుణ్యం, నాయకత్వ ప్రభావం, కార్యాచరణ ప్రణాళిక అనే అంశాలపై శిక్షకులు ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. చివరి రోజు ప్రజాప్రతినిధులందరితో కలిసి జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా, జడ్పీ సీఈవో జ్యోతిబసు గ్రూప్ ఫోటో దిగారు. శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 560.70 అడుగులు ఉంది. ఇది 234.07 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1800 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 69,522 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో..

అచ్చంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 14.15 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 5,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం ఆరు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

కళతప్పుతోన్న కర్రసాము!

- ప్రాచీన యుద్ధ విద్యలపై యువత అనాసక్తి
- వయసు సడలుతున్నా.. కర్ర వదలని మాస్టారు వీరరాఘవులు
- ఎంతో మంది శిష్యులను తీర్చిదిద్దిన గురువు
- నేడు పండగలకు, పలు సందర్భాల్లో ప్రదర్శనలు
- మనుగడకు ప్రభుత్వ ప్రోత్సాహం కావాలంటూ విజ్ఞప్తి



సత్కారం పొందిన సాపా వీరరాఘవులు

(ఆంధ్రజ్యోతి, చిలకలూరిపేట): కర్ర సాము, కత్తి సాము ప్రాచీన సాంప్రదాయ క్రీడలు. పాత సినిమాల్లో ఎన్టీఆర్, కాంతారావు, రాజనాల వంటి సినీ నటులు కర్రలు, కత్తులతో ఫైటింగ్ చేస్తుంటే సినీ ప్రేక్షకుల చప్పట్లు, ఈలలతో థియేటర్లు దద్దరిల్లేవి. కాలక్రమంలో ఈ క్రీడలు అంతరించిపోతున్నాయి. ప్రత్యేక సందర్భాలు, పండుగల వేళ కర్రసాము, కత్తిసాము ప్రదర్శనలతో సాధన చేసిన కొద్దిమంది ఈ కళ అంతరించిపోకుండా కంటికి రెప్పలా కాపాడుకొస్తున్నారు. ఒకప్పుడు ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 400 మంది కర్రసాము చేసేవారు. ఇప్పుడు అతి కొద్దిమంది మాత్రమే మిగిలి ఉన్నారు. శిక్షణ ఇచ్చే గురువులు లేకపోగా.. శిక్షణ పొందడానికి ముందుకు వచ్చే యువకులు కూడా కనిపించడం లేదు. పదేళ్ల క్రితం వరకు చిలకలూరిపేట సీఆర్ క్లబ్‌లో వీరాంజనేయ మల్లయుద్ధ వ్యాయామ శాల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో రెండుమూడు రోజులపాటు కర్రసాము పోటీలు జరిగేవి. బాణాకర్ర, ఒంటి చెడి కర్ర, రెండు చెడి కర్రల విభాగాల్లో పోటీలు నిర్వహించేవారు. పది జానలు, ఐదు జానలు, నాలుగు జానల కర్రలతో పోటీల్లో పాల్గొనేవారు. మొదట్లో రంగులు పూసి.. కర్రసాము ద్వారా ఎదుటి వ్యక్తి శరీరానికి రంగు అంటుకున్న దానిని బట్టి పోటీల్లో పాయింట్లు ఇచ్చేవారు.

75 ఏళ్ల వయసులోనూ..

తన దివంగత గురువులు బిరుదు సుబ్బయ్య, సూరం నాగభూషణం, చల్లా వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఇప్పటికీ దసరా పండగ రోజు 75 ఏళ్ల సాపా వీరరాఘవులు చిలకలూరిపేట కళా మందిర్ సెంటర్‌లో ప్రదర్శన ఇస్తున్నారు. ప్రతి ఉగాదికి ఇక్కడి కావమ్మతల్లి గుడి వద్ద కర్రసాము, కత్తిసాము ప్రదర్శనలు ఇస్తూ.. దశాబ్దాల తరబడి వస్తున్న సంప్రదాయాన్ని కొన సాగిస్తున్నారు. కర్రలు, కత్తులతో పలు రకాల విన్యాసాలు చేస్తూ ఆకట్టుకుంటున్నారు. కత్తిసాములో వాడే ఇనుప, ఇత్తడి కత్తి, డాలు, ఈటె, జింక కొమ్ములు వంటి వస్తువులను కాజా మొహిద్దీన్, పలువురు గురువుల నుంచి ఆయన సేకరించారు. ఆదరణ కోల్పోతున్న ఈ క్రీడలను కాపాడేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.



కర్రసాము వీరరాఘవులు

చిలకలూరిపేట చెందిన సాపా వీరరాఘవులు కర్రసాము, కత్తిసాములో ఎంతో ప్రావీణ్యం సాధించారు. కర్రసాము, కత్తిసాము మాస్టారుగా పేరుపొందారు. రాష్ట్రస్థాయి కర్రసాము పోటీలకు ఆయన న్యాయ నిర్ణేతగా వ్యవహరించేవారు. ఆయన గతంలో బాపట్ల, దుగ్గిరాల, రాజమండ్రి, చిలకలూరిపేటలో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచారు. ఆసక్తి గల వారికి కర్రసాములో శిక్షణ ఇచ్చేవారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కర్రసాము సాధన చేసేవారు. చిలకలూరిపేటకు చెందిన పేరుబోయిన వెంకటేశ్వర్లు, సుంకర హరిబాబు, అమీర్‌బాబు, లూదర్, సాప ఆదినారాయణ, వేల్పుల శివరామకృష్ణ ఆయన దగ్గర శిక్షణ పొందారు. వీరంతా పండుగ రోజుల్లో పలు చోట్ల ప్రదర్శనలు ఇచ్చేవారు. వ్యక్తిగతంగా, బృందాలుగా ఈ ప్రదర్శనలు కొనసాగుతుండేవి.



కర్ర సాము, కత్తి సాము ప్రదర్శనలో పాల్గొన్న ప్రముఖులు

సాగరం ఘుమ ఘుమలు



చేపలను శుభ్రం చేస్తున్న మహిళ

ఆలోచన ఉంటే ఉపాధి కొదవ లేదు. తెలిసిన పనిని తెలివిగా మలుచుకుంటే ఆదాయం అదే తెచ్చిపెడుతుంది. కానీ, దానికీ 'సమయం' రావాలి. ఆ పర్యాటక సమయాన్నే.. ఉపాధిగా మలుచుకుంటున్నారు.. విజయాపురిసౌత్ మత్స్యకారులు. నాగార్జున సాగర్‌కు వచ్చే పర్యాటకులకు మీనా ముక్కలకు మసాలాలు దట్టించి, సలసల కాగే నూనెలో వేయించి అందిస్తున్నారు. రోడ్డు పక్కనే చిన్న చిన్న గుడెసెలు వేసుకుని.. పెద్ద పెట్టుబడి లేకుండా..జీవనోపాధి పొందుతున్నారు. ఒక్క చేపల ఫ్రై మాత్రమే కాదు.. వేడి వేడి అన్నంలోకి చేపల పులుసు.. ఎవరైనా.. ఆర్డర్ ఇస్తే చేపల ఊరగాయలు కూడా అందిస్తున్నారు.

- పర్యాటకులకు..పసందైన చేప వంటకాలు
- స్థానిక మత్స్యకారులకు ఆదాయ మార్గం
- చేపల ఫ్రై..పులుసు.. ఆర్డర్ ఇస్తే ఊరగాయ
- ఉన్న ఊర్లోనే ఉపాధి.. రోడ్డు పక్కనే దుకాణం

మాచర్ల టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం నాగార్జున సాగర్ విజయపురి సౌత్ మత్స్యకారులకు చేపల వేటే జీవనాధారం. అయితే చేపలు పట్టి విక్రయించడమే కాదు.. వాటిని వేయించి వేడివేడిగా పర్యాటకులకు అందిస్తూ ఆదాయం పొందుతున్నారు. ఇలా ఒక కుటుంబం నుంచి మొదలైన ఈ చిరు వ్యాపారం.. నేడు 50 కుటుంబాలకు చేరింది. నాగార్జున సాగర్‌కు వచ్చే పర్యాటకులకు అప్పటికప్పుడు వేడి వేడిగా ఫిష్ ఫ్రై, ఫిష్ కర్రీ అందిస్తున్నారు. ముందుగా ఆర్డర్ ఇస్తే చేప పచ్చళ్లు కూడా తయారు చేసి సప్లయి చేస్తున్నారు. నాగార్జున సాగర్ వై జంక్షన్ నుంచి మొదలుపెట్టుకొని నూతన బ్రిడ్జి వరకు రోడ్డుకు ఇరువైపులా చిన్న పాకలు ఏర్పాటు చేసుకున్నారు. మత్స్యకార మహిళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫిష్ ఫ్రైలు అందిస్తూ.. అన్ని ఖర్చులు పోనూ రోజూ రూ. 600 నుంచి రూ. 1000 దాకా ఆదాయం గడిస్తున్నారు.

ఫ్రైకు వాడే చేపలు

నల్ల బొచ్చులు, రవ్వలు, పాంప్లెట్లు వంటి చేపలను ప్రధానంగా ఫ్రై చేసి అందిస్తున్నారు. కళ్ల ముందే ఫ్రెష్‌గా చేపలను చూపించి అప్పటికప్పుడు శుభ్రపరిచి కార్న్ పౌడర్, కారం, ఉప్పు, తగినంత గరం మసాలా దట్టించి బాండీలో సలసలలాడే మంచి నూనెలో ఫిష్ ముక్కలు వేయించి ఇస్తున్నారు. సుదూర ప్రాంతాల పర్యాటకులు, హైదరాబాద్ వెళ్లే వారు.. ఇక్కడ రోడ్డు పక్కన వాహనాలు నిలుపుకొని ఓ చేప ముక్క రుచి చూసి వెళ్తుంటారు. మరికొంత మంది మహిళలు చేప పులుసు, వైట్ రైస్ అందుబాటులో ఉంచి వినియోగదారులకు అందిస్తున్నారు. ఇలా మత్స్యకార కుటుంబాలు స్థానికంగానే ఉపాధిని పొందుతున్నాయి.



బాండీలో చేపలను ఫ్రై చేస్తున్న మహిళ

సాగర్‌కు పర్యాటకుల తాకిడి..

ఎగువ రాష్ట్రాల్లో కృష్ణా నదికి వరద నీరు చేరి దిగువకు శ్రీశైలం, నాగార్జున సాగర్ వరద ప్రవహిస్తున్నప్పుడు క్రస్ట్ గేట్లు ద్వారా నీటి విడుదల చేస్తారు. ఇలాంటి సమయాల్లో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. మత్స్యకార కుటుంబాలకు ఈ సమయమే.. ఎక్కువగా వ్యాపారం సాగుతుంది. జూలై, ఆగస్టు, సెప్టెంబరులో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది.



రోడ్డు పక్కన పాకను ఏర్పాటు చేసి..

తిరుపతి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ధర్మవరానికి పొడిగింపు



గుంటూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నెమలిపురి, రొంపిచర్ల నూతన రైలు మార్గంలో ప్రవేశపెట్టిన నాందేడ్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు ఒకటో తేదీ నుంచి ధర్మవరం వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1, 8, 15, 22, 29(శుక్రవారం) తేదీల్లో 07189- నాందేడ్ - ధర్మవరం ప్రత్యేక రైలు సాయంత్రం 4.30కి బయలుదేరి అర్ధరాత్రి 12.03కి నడికుడి, 12.28కి పిడుగురాళ్ల, 12.58కి నెమలిపురి, 1.23కు రొంపిచర్ల, 1.58కి వినుకొండ, శనివారం వేకువమజామున 5.30కి నంద్యాల, మధ్యాహ్నం 12 గంటలకు తిరుపతి, సాయంత్రం 5.30కి ధర్మవరం చేరుకొంటుంది. 07190 ధర్మవరం - నాందేడ్ ప్రత్యేక రైలు ఆగస్టు 3, 10, 17, 24, 31(ఆదివారం) తేదీల్లో వేకువజామున 5.30కి బయలుదేరి ఉదయం 10.20కి తిరుపతి, సాయంత్రం 4.10కి నంద్యాల, రాత్రి 7.28కి వినుకొండ, 8.03కి రొంపిచర్ల, 8.28కి నెమలిపురి, 8.58కి పిడుగురాళ్ల, 9.28కి నడికుడి, 11.48కి చర్లపల్లి, సోమవారం వేకువజామున 5.18కి బాసర, ఉదయం 8.30కి నాందేడ్ చేరుకొంటుంది.

హైదరాబాద్ - కొల్లం - హైదరాబాద్ ప్రత్యేక రైళ్లు

07193 హైదరాబాద్ - కొల్లం ప్రత్యేక రైలు ఆగస్టు 16 నుంచి అక్టోబరు 11వ తేదీ వరకు ప్రతి శనివారం రాత్రి 11.10కి బయలుదేరి 11.30కి సికింద్రాబాద్, ఆదివారం రాత్రి 2.59కి నడికుడి, 3.43కి పిడుగురాళ్ల, 4.33కి సత్తెనపల్లి, 5.30కి గుంటూరు, మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి.. సోమవారం వేకువజామున 4.09కి చెంగనూరు, ఉదయం 7.10కి కొల్లాం చేరుకొంటుంది. 07194 కొల్లాం - హైదరాబాద్ ప్రత్యేక రైలు ఆగస్టు 18 నుంచి అక్టోబరు 13వ తేదీ వరకు ప్రతి సోమవారం ఉదయం 10.45కి బయలుదేరి 11.48కి చెంగనూరు, అర్ధరాత్రి 2.55కి తిరుపతి, మంగళవారం ఉదయం 10.40కి గుంటూరు, 11.33కి సత్తెనపల్లి, 11.53కి పిడుగురాళ్ల, మధ్యాహ్నం 12.19కి నడికుడి, 3.55కి సికింద్రాబాద్, సాయంత్రం 5.30కి హైదరాబాద్ చేరుకొంటుంది.

కన్యాకుమారి - హైదరాబాద్ - కన్యాకుమారి ప్రత్యేక రైలు సర్వీసులు

07239 కన్యాకుమారి - హైదరాబాద్ ప్రత్యేక రైలు ఆగస్టు 15 నుంచి అక్టోబరు 10వ తేదీ వరకు ప్రతి శుక్రవారం వేకువజామున 5.15కి బయలుదేరి మధురై, కొడైకెనాల్ రోడ్డు, తంజావూరు, కుంభకోణం, చిదంబరం, తిరువణ్ణామలై మీదగా రాత్రి 10.10కి తిరుపతి, శనివారం వేకువజామున 5.50కి గుంటూరు, ఉదయం 7 గంటలకు సత్తెనపల్లి, 8 గంటలకు నడికుడి, మధ్యాహ్నం 1.05కి సికింద్రాబాద్, 2.30కి హైదరాబాద్ చేరుకొంటుంది. 07230 హైదరాబాద్ - కన్యాకుమారి ప్రత్యేక రైలు ఆగస్టు 13 నుంచి అక్టోబరు 8వ తేదీ వరకు ప్రతీ బుధవారం సాయంత్రం 5.20కి బయలుదేరి 5.45కి సికింద్రాబాద్, రాత్రి 9.19కి నడికుడి, 9.59కి సత్తెనపల్లి, 11 గంటలకు గుంటూరు, గురువారం ఉదయం 7.30కి తిరుపతి, మధ్యాహ్నం 12.40కి తిరువణ్ణామలై, రాత్రి 9.45కి మధురై, అర్ధరాత్రి దాటాక 2.30కి కన్యాకుమారి చేరుకొంటుంది.



పరిచయ వేదికలో మాట్లాడుతున్న ప్రతినిధులు

విద్యార్థులకు చక్కని బోధన

చీరాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ అనుభవం గల అధ్యాపకులతో విద్యార్థులకు చక్కని బోధన అందిస్తున్నట్లు చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. గురువారం కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అలాగే కళాశాలలో ఏపీ ఎస్ఎస్‌డీసీ వారి ఆధునిక సీమెన్స్ ల్యాబ్‌లో మిషన్‌లు శిక్షణకు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్, పాలిటెక్నిక్ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ విజయభాస్కరరెడ్డి, డాక్టర్ సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.


చందలూరు సరిహద్దు డొంకలో పంట పొలాల నీటి ప్రవాహానికి అడ్డుగా వేసిన మట్టి కువ్వలను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న అధికారులు

అడ్డువేసిన మట్టికువ్వల తొలగింపు

పంగులూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని చందలూరు గ్రామ సరిహద్దు డొంకలో ఎగువ పొలాల నుంచి వచ్చే వర్షపు నీరు ముందుకు వెళ్లకుండా అడ్డుగా వేసిన మట్టికువ్వలను అధికారులు గురువారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. చందలూరు గ్రామ సర్వేనెంబరు 819 సరిహద్దు డొంక కాగా ఇంకొల్లు మండలం కొణికి గ్రామానికి చెందిన కొందరు రైతులు ఎగువ పొలాల నుంచి పారుదల అయ్యే వర్షపు నీటికి అడ్డుగా మట్టి కువ్వలు తోలారు. ఈ విషయమై ఇరు గ్రామాల మధ్య తలెత్తిన సమస్య పరిష్కారం కోసం చీరాల ఆర్డీవో గత కొద్దిరోజుల క్రితం విచారణ చేపట్టారు. ఆసమస్య పరిష్కారంలో భాగంగా మండల తహసీల్దార్ సింగారావు, రేణంగివరం ఎస్ఐ వినోద్‌బాబు గురువారం ఎక్స్‌కవేటర్‌తో నీటి పారుదలకు అడ్డుగా ఉన్న మట్టి కువ్వలను గురువారం తొలగించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయునికి సత్కారం

ఎనిమిదేళ్లపాటు విద్యార్థులకు ఉత్తమ బోధన చేసి బదిలీ అయిన తోట శ్రీహరిబాబును కోటపాడు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం గురువారం ఘనంగా సత్కరించింది. గత ఎనిమిదేళ్లలో శ్రీహరిబాబు అందించిన సేవలను కొనియాడారు. పాఠశాల హెచ్ఎం వేణుబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


భద్రయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

భద్రయ్య మృతి టీడీపీకి తీరని లోటు

చినగంజాం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రుద్రమాంబపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కొండూరు భద్రయ్య(55) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. భద్రయ్య మృతి పట్ల పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి, కుటుంబసభ్యులకు తీరని లోటుని అన్నారు. మండల టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాంఅజాద్, మోటుమర్రి రామసుబ్బారావు, కొక్కిలిగడ్డ రామాంజనేయులు, మోటుపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు సింగోతు శ్రీనులు భద్రయ్య పార్థీవదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, సానుభూతి తెలియజేశారు.


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొనుగోళ్లు వేగవంతం చేయాలని వినతి

ఇంకొల్లు,జూలై 17,(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీకి వినతి పత్రం అందజేసారు.ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలని లేకుంటే రైతులు ఇబ్బందులు పడాల్సివస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.పొగాకు రైతులు ఆందోళన చెందనవసరం లేదని చివరి ఆకువరకు పొగాకు కొనుగోలు చేస్తామని డీఎం హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జీవీఎల్ మోహన్‌గౌడ్,ఇంకొల్లు మండల నాయకులు కృష్ణయ్యవెంకటేశ్వరరావు ఉన్నారు.

సూపర్ సిక్స్‌తో మభ్య పెట్టారు

- వైసీపీ ఇన్‌చార్జి వెంకటేష్

వేటపాలెం(చీరాల), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జీ కరణం వెంకటేష్ అన్నారు. వేటపాలెం మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ పరిధిలో గురువారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ తల్లికి వందనంలో కొర్రీలు పెట్టి కడుపు కోత మిగిల్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కరణం వెంకటేష్

ఫలించిన ఎమ్మెల్యే వ్యూహం

- చీరాల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక
- అన్ని సామాజిక వర్గాలకు న్యాయం

చీరాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు చీరాల మున్సిపల్‌పై టీడీపీ జెండా ఎగిరింది. అవిశ్వాసం అంశం తెరపైకి వచ్చి, అప్పటి చైర్మన్ జంజనం శ్రీనివాసరావును తొలగించడం నుంచి నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపికల వరకు ప్రజల్లో, రాజకీయ విశ్లేషకుల్లో ఎమ్మెల్యే కొండయ్యపై భిన్న స్వరాలు వినిపించాయి. ఈక్రమంలో ప్రత్యర్థులు సైతం కొండయ్య వ్యూహాన్ని దెబ్బతీసేందుకు ఒకింత గట్టిగానే ప్రయత్నాలు సాగించారు. అయితే మొదటి సారి ఎమ్మెల్యే ఎక్కడా కూడా రాజీ పడకుండా కొండయ్య వ్యూహాన్ని రచించారు. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ పురపాలక సంఘంపై విజయ బావుటా ఎగుర వేశారు.

అడుగడుగునా ఆటంకాలు...చిక్కు ప్రశ్నలు

అయితే అవిశ్వాసం అంశం వెలుగులోకి రావడంతో అప్పటి చైర్మన్ జంజనం నేరుగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో స్థానిక శాసనసభ్యుడి ప్రమేయం లేకుండా ఈ వ్యవహారం జరగదని భావించిన ఎమ్మెల్యే వర్గానికి చెందిన కౌన్సిలర్‌లు ఆయనపై అలకబూనారు. కొద్ది రోజులు పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగా ఉన్నారు. ఈక్రమంలో దాదాపుగా ఎమ్మెల్యే తడబడతారని గట్టిగానే వాదనలు వినిపించాయి. అయితే ఏమాత్రం పార్టీ పాలసీని అతిక్రమించకుండా, దుష్ప్రచారాలకు చెక్ పెడుతూ తిరిగి అందరిని ఏకతాటిపైకి తెచ్చారు. ఇదిలా ఉంటే అవిశ్వాసం తెలిపిన వారిలో నలుగురు ఆశావహులు వేర్వేరు సామాజిక వర్గాలు కావడంతో కొత్తగా తెరపైకి ఓసామాజిక వర్గం సమస్య గట్టిగా వినిపించింది. దీంతో చాలావరకు అధిష్ఠానం సైతం ఈ విషయంలో జోక్యం చేసుకుని రోజులు తరబడి చర్చలు సాగించాల్సి వచ్చింది.

తడబడినా నిలబడ్డారు...

ఈక్రమంలో పలుమార్లు చర్చలు అనంతరం బీసీ సామాజిక వర్గానికి చెందిన చైర్మన్‌ను పదవి నుంచి తొలగించారు. తిరిగి బీసీ వర్గానికి చెందిన మించాల సాంబశివరావుకు చైర్మన్ పదవిని కట్టబెట్టారు. అలాగే గతంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వైస్ చైర్మన్‌ను అవిశ్వాసంలో తొలగించగా, అదే సమయంలో ఓసీ సామాజిక వర్గానికి చెందిన మరో మహిళ వైస్ చైర్మన్ పదవికి రాజీనామా ప్రకటించారు. అయితే దీనిపై ఎలక్షన్ కమిషన్ ఆమోదం తెలపాల్సి ఉంది. ఈక్రమంలో ఖాళీ అయిన వైస్ చైర్మన్‌ల సామాజిక వర్గాల ప్రాతిపదికన చైర్మన్ పదవిని ఆశించి భంగపడ్డ 18వ వార్డు కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్యను వైస్‌చైర్మను చేశారు. దీంతో ప్రిసైడింగ్ అధికారులు నియామక పత్రాన్ని అందజేసి, ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే ఎస్సీ సామాజిక వర్గం వైస్‌చైర్మన్‌గా త్వరలో అదే సామాజిక వర్గానికి న్యాయం చేయనున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈక్రమంలో గతకొన్ని నెలలుగా ట్విస్ట్‌ల మీద ట్విస్టులతో సాగిన మున్సిపల్ అంశంకు ఎట్టకేలకు తెరపడింది. అలాగే పరిపాలనను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యం కల్పించడంతో మొదట్లో కొంత తడబడినా నిలబడటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నూతనంగా ఎంపికయిన చైర్మన్, వైస్ చైర్మన్‌లతో ఎమ్మెల్యే కొండయ్య, మహేంద్రనాథ్

వసతి.. దయనీయం

(5వ పేజీ తరువాయి)

నరసరావుపేట తదితర ప్రాంతాల్లో కళాశాల, పాఠశాల స్థాయి హాస్టళ్లు అద్దెభవనాల్లోనే ఉన్నాయి. అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఉన్నా హాస్టళ్ల పర్యవేక్షణ సక్రమంగా సాగడం లేదు. కొంతమంది వార్డెన్లు వెల్ఫేర్ ఆఫీసర్లను మేనేజ్ చేసి విధులకు డుమ్మా కొడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా విద్యార్థుల సంక్షేమం గాలిలో దీపం అన్న చందంగా మారింది. అద్దె భవనాల్లో విద్యార్థులకు సరిపడినన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు వారికి ఇవ్వాల్సిన దుప్పట్లు కూడా సకాలంలో అందడం లేదు. ఏటా చలికాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వైద్య పరీక్షలు మరిచారు..

హాస్టళ్లలో వసతి పొందే విద్యార్థులకు కనీసం మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాల్సిన వైద్య పరీక్షలు గత కొన్నేళ్లలో జరిగిన దాఖలాలు లేవు. ఫలితంగా విద్యార్థులు చర్మ సంబంధ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు కలుషిత నీరు ఆహారం తీసుకుని విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నా పట్టించుకోవడం లేదు.

కాస్మెటిక్ చార్జీల కోసం ఎదురుచూపు

హాస్టళ్లలో విద్యార్థులకు ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలి. అయితే ఇవి సక్రమంగా అందడం లేదు. కొంతంగా సబ్బులు నూనెలు తదితర వస్తువులు సొంత డబ్బులతోనే కొనుగోలు చేసుకుంటున్నారు.

తూతు మంత్రంగా మెనూ

విద్యార్థులకు నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు చేయడం లేదు. ఫలితంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందని ద్రాక్షలాగా మారింది. గుంటూరులోని కొన్ని హాస్టళ్ల విద్యార్థులు సమీపంలోని అన్న క్యాంటీన్లలో భోజనం చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరికొందరు రైస్ కుక్కర్లను ఇళ్ల నుంచి తెచ్చుకొని హాస్టల్ గదుల్లోనే వంట చేసుకుంటున్నారు. ఇదంతా ఉన్నత స్థాయిలో అధికారులకు తెలిసిన చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఫిష్ ఆంధ్రా...షాపులేవీ!

(5వ పేజీ తరువాయి)

ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది

జిల్లాలో 103 యూనిట్లు...

ఫిష్ ఆంధ్రా మాల్స్‌ను మూడు కేటగిరీల్లో గత ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో ఒక్కోటి పది లక్షల విలువ కలిగిన యూనిట్లు 7 ప్రారంభించారు. ఇందులో జనరల్-5, ఎస్సీ-2 కేటాయించారు. ఇందులో జనరల్ కేటగిరీకి 40 శాతం సబ్సిడీ కాగా ఎస్సీలకు 60 శాతం రాయితీ అందించారు. ఒక్కో యూనిట్ రూ.1.75లక్ష విలువ కలిగినవి 93 ప్రారంభించగా జనరల్-56, ఎస్సీ-18, ఎస్టీలకు 19 కేటాయించారు. అదే విధంగా ఫిష్ వాల్యూ యాడెడ్ ఎంటర్‌ప్రైజెస్ కింద 50 లక్షల విలువ కలిగిన యూనిట్లను మూడు మంజూరు చేశారు. అన్నింటిల్లో కూడా జనరల్‌కు 40 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం రాయితీని ప్రభుత్వం అందించింది. దాదాపు రూ. 1.50 కోట్ల ప్రభుత్వ సొమ్ము రాయితీల రూపంలో అందింది. మత్స్యశాఖ దగ్గర ఈ సమాచారం తప్ప ఏ ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేశారు, కేటగిరీల వారీగా లబ్ధిదారుల వివరాలు లాంటివి ఏవీ అందుబాటులో లేకపోవడం మరింత విడ్డూరంగా ఉంది

దాదాపు అన్నీ మూతే...

ఇంత పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా షాపులు జిల్లాలో ఇప్పుడు ఎక్కడ ఉన్నాయని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉంది. దాదాపు 75 శాతం మూతపడగా, మరికొన్నింటిని వేరే అవసరాలకు వినియోగించుకుంటూ బోర్డు మాత్రం అదే కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ఆ పథకం అమలు తీరు తెన్నులపై లోతుగా విచారణ చేపడితే ప్రభుత్వ సొమ్మును అర్హత లేని వాళ్లు ఎంత దోచుకున్నారో బహిర్గతమయ్యే అవకాశాలు ఉన్నాయి.

ప్రజా సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

చినగంజాం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్‌కలాంఅజాద్‌లు అన్నారు. చినగంజాం గ్రామంలో గురువారం రాత్రి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నేతలు నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు టి.జయరావు, సందు శ్రీనివాసరావు, భయ్యా సతీష్‌కుమార్, దర్శవరపు ఏసునారాయణ తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నేతలు

హెపటైటిస్ బీ,సీ నిర్ధారణ పరీక్షలు

చినగంజాం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : చినగంజాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో చీరాల మహిళా మండలి ఆధ్వర్యంలో హై రిస్క్ కలిగిన వ్యక్తులకు హెపటైటిస్ బీ, సీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు ప్రాజెక్టు మేనేజర్ కే.వెంకటరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ హెపటైటిస్ పరీక్షల్లో నెగటివ్‌గా తేలినవారికి హెపటైటిస్ బీ వాక్సిన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. హెచ్ఐవీతో పాటు ఇతర వైరస్ వ్యాధులను ఆరికట్టేందుకు ఈ చర్యలు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. 48 మందికి హెపటైటిస్ వాక్సిన్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల మహిళా మండలి ప్రతినిధులు సీయోనుకుమారి, జ్యోతి, సంధ్యారాణి, దానమ్మ, దివ్యభాను, విజయ్, శిరీష, శ్రీగీతలు పాల్గొన్నారు.


హెపటైటిస్ బీ వాక్సిన్ వేస్తున్న చీరాల మహిళా మండలి సభ్యులు

అద్దంకి ఎస్సై బాధ్యతల స్వీకరణ

అద్దంకి,జూలై17(ఆంధ్రజ్యోతి): అద్దంకి టౌన్ ఎస్సైగా నరసింహ గురువారం బాధ్యతలు చేపట్టారు. అద్దంకి టౌన్ పోలీస్ స్టేషన్‌లో గతంలో ఉన్న ఇద్దరు ఎస్సైలు బదిలీ కావటంతో ఎస్సై పోస్టులు కొంత కాలంగా ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో గతంలో మాచర్ల టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ లలో ఎస్సైగా పని చేసిన నరసింహను అద్దంకి స్టేషన్‌లో ఎస్సైగా నియమించారు. సీఐ సుబ్బరాజును కలిసి గురువారం విధులలో చేరారు.


సీఐ సుబ్బరాజుకు నిమ్మకాయ అందజేస్తున్న ఎస్ఐ నరసింహ

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అద్దంకిటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండి వాటి ప్రకారం నడుచుకోవాలని న్యాయవాది చిన్ని మురళీకృష్ణ అన్నారు. గురువారం ఇంటర్‌నేషనల్ లా డే సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో రోటరీ కార్యాలయంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బీవీపూర్ణచంద్రరావు, కార్యదర్శి ఏ. హరిప్రసాద్, ట్రెజరర్ గురుశేఖర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

అద్దంకిటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మెను విరమించబోమని అద్దంకి మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు జాను, యు. సామ్యూలులు అన్నారు. గురువారం గుంటూరులోని వడ్డేశ్వరంలో ఉన్న సీఅండ్‌డీఎంఏ ఆఫీస్ వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంపాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకి అద్దంకి మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. మార్కు, జాషువా, రమేష్, మారుతి తదితరులు తరలివెళ్లారు.

64 మంది గ్రామ సచివాలయ సిబ్బంది బదిలీ

అద్దంకిటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): అద్దంకి మండలంలోని గ్రామ సచివాలయాలల్లో పని చేస్తున్న 64 మంది సిబ్బంది బదిలీ అయ్యారని ఎంపీడీవో బత్తిన సింగయ్య గురువారం తెలిపారు. బదిలీ అయిన వారిని విధుల నుంచి రిలీవ్ చేశామని ఆయన తెలిపారు.

ఎలక్ట్రీషియన్ అనుమానాస్పద మృతి

ఒంగోలు క్రైం, జూలై17(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రీషియన్ పనులు చేసే షేక్ అబ్దుల్ ఖాదర్ (34) అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఈ సంఘటన ఒంగోలులోని గోపీకృష్ణ థియేటర్ నుంచి శ్రీనివాస హాలుకు వెళ్లే దారిలో గల కట్టెల అడితి వద్ద జరిగింది. అబ్దుల్‌ఖాదర్ మురుగు కాలువలో పడి ఉన్నాడు. బలరాంకాలనీకి చెందిన క్యాటరింగ్ పనులు చేసే హర్షిత్‌కుమర్ గుర్తించి స్థానికుల సహాయంతో ఆయనను కాలువలో నుంచి బయటకు తీసి 108 వాహనం ద్వారా రిమ్స్‌కు తరలించారు. అయితే అబ్దుల్‌ఖాదర్ అప్పటికే మృతి చెందిన ట్లు డాక్టర్లు చెప్పారు. కనిగిరి చెందిన అబ్దుల్‌ఖాదర్ ఒంగోలులోని గాంధీనగర్ లో నివాసం ఉంటూ ఎలక్ట్రీషియన్, పెయింట్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం రాత్రి మద్య మత్తులో మురుగు కాలువలో పడి మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

నిరుద్యోగభృతిని వెంటనే అమలు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో నిరు ద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు రూ.3వేలు నిరుద్యోగ భృతి చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో గురువారం ఏఐవై ఎఫ్ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

చీరాల పట్టణంలో చోరీ

- రూ. 5 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు, గ్యాస్ సిలిండర్‌ల అపహరణ
- క్లూస్ టీం ఆధారంగా వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చీరాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా ఇంట్లో ఎవ్వరూ లేకపోవడం గమనించిన దుండగులు తాళాలు పగులకొట్టి బంగారు ఆభరణాలు, వస్తువులు అపహరించారు. అందిన వివరాల ప్రకారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో పల్లపోతు సాయిసుబ్రహ్మణ్యం ముందు వైపు కళ్లజోళ్ల దుకాణం నిర్వహిస్తూ వెనుక భాగం ఇంట్లో నివాసం ఉంటున్నారు. అయితే 15 రోజులుగా ఒంగోలులోని కుమారుని వద్దకు వెళ్లారు. దీంతో ఇంట్లో, దుకాణంలో ఎవరూ లేకపోవడం గమనించిన దుండగులు అర్ధరాత్రి షాపు, ఇల్లు తాళాలు పగులకొట్టి సుమారు 5 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదు, 2 గ్యాస్ సిలిండర్‌లు, మరికొన్ని వస్తువులు అపహరించారు. ఉదయం ఇరుగు పొరుగు వారు గుర్తించి సమాచారం అందించడంతో హుటాహుటిన ఇంటికి చేరుకుని దొంగతనం జరిగినట్లు తెలుసుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసుకుని క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

సంతమాగులూరు జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలో పిడుగుపాటుకు గేదెలు కాస్తున్న మహిళ మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి.ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గ్రామంలోని సజ్జాపురం రోడ్డులో గేదెలు మేపుతున్న వారిపై పిడుగు పడింది. ఈ ఘటనలో అబ్బులగిరి పద్మ (47) అక్కడికక్కడే మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన గేదెల కాపరి ఓరుగంటి సుబ్బారెడ్డికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని మెరుగైన వైద్యం నిమిత్తం నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. పద్మకి భర్త ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేటకు తరలించారు.


పిడుగుపాటుకు గురై మృతిచెందిన అబ్బలగిరి పద్మ

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

బల్లికురవ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : బైకుపై నుంచి జారి పడి వైద్యశాలలో చికిత్స పొందుతూ వృద్ధురాలు గుంటకల గోవిందమ్మ(56) గురువారం ఉదయం మృతి చెందింది. ఎస్ఐ వై. నాగరాజు కథనం ప్రకారం వినుకొండ మండలం నాగులవరంకు చెందిన గుంటకల గోవిందమ్మ మంగళవారం తన కుమారుని బైకుపై మార్టూరు వెళుతుండగా చెన్నుపల్లి గ్రామానికి వచ్చే సరికి ఆమెకు బీపీ పెరిగి బైకుపై నుంచి కింద పడి పోయింది. తీవ్ర గాయాలు అయిన వృద్ధురాలిని 108లో ముందుగా గుంటుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతు గురువారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


సాధునగర్ వద్ద రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడ్డ కారు


గాయపడ్డ ఆంజనేయులు

లారీని ఓవర్‌టేక్ చేస్తూ

అదుపు తప్పి కారు బోల్తా

- బేల్దారి మేస్త్రి, కుటుంబసభ్యులకు గాయాలు

అద్దంకి,జూలై17(ఆంధ్రజ్యోతి): లారీని అధిగమించే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బేల్దారి మేస్త్రి ఆంజనేయులుతో పాటు కుటుంబసభ్యులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు మద్దిపాడు మండలం తెల్లబాడుకు చెందిన చీకటి ఆంజనేయులు హైదరాబాద్‌లో బేల్దారి మేస్త్రిగా ఉంటూ కూలీలతో పనులు చేయిస్తున్నారు. స్వగ్రామమైన తెల్లబాడు నుంచి గురువారం ఉదయం బయలుదేరి కూలీలు పనికి వెళ్లే సమయానికి హైదరాబాద్ చేరుకోవాలన్న ఉద్దేశంతో వెళ్తూ అద్దంకి మండలం సాధునగర్ వద్ద నామ్ రోడ్డులో ముందు వెళ్తున్న లారీని ఎడమ వైపు క్రాస్ చేస్తూ లారీ తగలటంతో కారు అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడింది. బెలూన్‌లు తెరుచు కోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు, భార్య వనజ, కుమారుడు నిఖిల్, కుమార్తె దివ్యలకు గాయాలు అయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఏఎస్సై వెంకటేశ్వర్లు పరిశీలించారు.

ఇంకొల్లు పోస్టాఫీసు అడ్రస్ మార్పు

ఇంకొల్లు,జూలై 17,(ఆంధ్రజ్యోతి) :ఇంకొల్లులోని పర్చూరు రోడ్డులో ప్రస్తుతం కొనసాగుతున్న పోస్టాఫీసును హనుమోజిపాలెం రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలోకి మార్చినట్లు సబ్‌పోస్ట్ మాస్టర్ జి.భార్గవ్‌కిరణ్ తెలిపారు.ఈ నెల 19 వతేదీ నుంచి 21 వరకు ఆఫీసును మార్చుతున్నందున ఎటువంటి లావాదేవీలు జరగవని, 22వ తేదీ నుంచి నూతనంగా మార్చిన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తామని తెలిపారు. వినియోగదారులు ఈ మార్పును గమనించాలని కోరారు.

అవీ.. ఇవీ



ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న డాక్టర్ హృదయనాథ్

సొసైటీకి పూర్వవైభవం తీసుకురండి

మేదరమెట్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): రావినూతల సొసైటీకి పూర్వ వైభవం తీసుకురావాలని డాక్టర్ ఈదుపుగంటి హృదయనాథ్ అన్నారు. గురువారం రావినూతల సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హృదయనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు(బాబు) అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గతంలో సొసైటీ ఎన్నో వ్యాపారాలు చేసి సభ్యులకు లాభాలు పంచిందన్నారు. వ్యవసాయ అభివృద్ధికి అవసరం అయిన ఎరువులను సకాలంలో అందించిన ఘనత సొసైటీదన్నారు. రైతులకు అవసరమైన పంట రుణాలను అందించడంలో సొసైటీ ముందుందన్నారు. చైర్మన్‌గా పుట్టా వెంకట్రావు, సభ్యులుగా చేబ్రోలు నాగేశ్వరరావు, నాదెండ్ల తిరుపతిరావులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో అనుబ్రోలు కస్తూరి, కారుసాల గురుబాబు, మోపర్తి వెంకట్రావు, మోపర్తి లక్ష్మీనారాయణ తదితరులు హాజరయ్యారు.


నల్లబర్లీ పొగాకు బేళ్ల జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ సింగారావు

నల్లబర్లీ కొనుగోలు కేంద్రం తనిఖీ

పంగులూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నల్లబర్లీ కొనుగోలు కేంద్రాలలో పొగాకు కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా చూడాలని మండల తహసీల్దార్ సింగారావు సూచించారు. పంగులూరు మార్కెట్‌యార్డ్‌లో నిర్వహిస్తున్న నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లను తహసీల్దార్ గురువారం పరిశీలించారు. గత నెల 30వతేదీ నుంచి బుధవారం వరకు జరిగిన రోజువారీ కొనుగోళ్లను గ్రేడ్‌ల వారీగా పరిశీలించారు. పంగులూరు కొనుగోలు కేంద్రంలో బుధవారం వరకు 2,391 బేళ్లు, (1984.88 క్వింటాళ్లు)ను రైతుల నుంచి కొనుగోలు జరిగిందని పీఏసీఎస్ సీఈవో నాగబోయిన లక్ష్మీదేవి తెలిపారు. హెచ్‌డీఆర్ 435 బేళ్లు(397.72 క్వింటాళ్లు),హెచ్‌డీఎం 961 బేళ్లు (839.65 క్వింటాళ్లు), హెచ్‌డీఎక్స్ 995 బేళ్లు (747.51 క్వింటాళ్లు) కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోళ్లకు అనుమతించిన రైతులు మినహా ఎవరినీ కొనుగోలు కేంద్రంలోకి అనుమతించవద్దని తహసీల్దార్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బయ్యర్ మారెళ్ల శ్రీధర్‌బాబు, వీఆర్వో చింపారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకరరావు

ఓటర్ల జాబితా తయారీలో బూత్ లెవల్ అధికారుల పాత్ర కీలకం

చినగంజాం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా తయారీలో బూత్ లెవల్ అధికారుల పాత్ర చాలా కీలకమని తహసీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో మండల పరిధిలోని బూత్ లెవల్ అధికారులకు ఓటర్ల జాబితా చేర్పులు, మార్పులు, సవరణలపై గురువారం నిర్వహించిన ప్రత్యేక శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని బీఎల్వోలకు సూచించారు. బీఎల్వోలు ఓటర్ల జాబితా చేర్పులు, మార్పులు, సవరణలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ఉండాలని అన్నారు. శిక్షకులు ఏఎస్‌వో శ్రీమన్నారాయణ బీఎల్వోలకు పలు అంశాలకు సంబంధించి శిక్షణ అందించారు. శిక్షణ అనంతరం వారికి ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.మాధవీలత, బీఎల్వోలు, ఆపరేటర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పునరావాస కాలనీలలో పుట్టెడు సమస్యలు

- ఆలయాల నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో..
- కొలిక్కిరాని శ్మశానాలకు స్థలం కేటాయింపు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

అద్దంకి,జూలై17(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామాల పునరావాస కాలనీలలో కనీస వసతుల మాట అటుంచి తప్పని సరిగా అవసరమైన దేవాలయాల నిర్మాణం, శ్మశానాలకు స్థలాల కేటాయింపు ఇంకా కొలిక్కిరాలేదు. సుమారు రెండు దశాబ్దాల క్రితం గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణం ప్రారంభం కాగా, ఆయా గ్రామాలకు పునరావాస కాలనీలు కేటాయించారు. అయితే పునరావాస కాలనీలలో వసతుల కల్పనపై ప్రభుత్వాలు దృష్టి సారించలేదు. టీడీపీ ప్రభుత్వంలో కొంత మేర పనులు జరగగా, గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముంపు గ్రామాలు, పునరావాస కాలనీల ప్రజలలో ఆశలు ఒకింత చిగురించాయి. అయితే ఏడాది సమయం గడిచినా అసంపూర్తి పనులు పూర్తి చేయటంలో వేగం కనిపించక పోవటంతో కొంత నిరుత్సాహానికి గురవుతున్నారు. ప్రధానంగా సుమారు 15 సంవత్సరాల క్రితం వేణుగోపాలపురం పునరావాస కాలనీకి వెళ్లిన పాత కొటికలపూడి గ్రామస్థులు సుమారు 4 కి.మీ దూరంలో ఉన్న శ్మశాన వాటికనే వినియోగించుకోవాల్సి వస్తోంది. దీంతో మృతదేహాలను ఆటోలలో తీసుకువెళ్లాల్సి రావటం తో 3 వేల నుంచి 5 వేల రూపాయలు చెల్లించాల్సి రావటం భారంగా మారింది. ధేనువకొండ గ్రామస్థులకు నాలుగు చోట్ల పునరావాస కాలనీలు ఏర్పాటు చేయగా బలరామకృష్ణాపురంలో మాత్రమే శ్మశాన స్థలం కేటాయింపు జరిగింది. వేలమూరిపాడు సమీపంలోని పునరావాస కాలనీలో ఉండే కుటుంబాలు తమ కుటుంబసభ్యులలో ఎవరైనా మృతి చెందితే వేలమూరిపాడు శ్మశానానికి తీసుకు వెళ్ళాల్సి రావటంతో తరచూ వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక దక్షిణ ధేనువకొండ, మేదరమెట్ల వద్ద కేటాయించిన పునరావాస కాలనీలకు ఇంకా ప్రజలు వెళ్లలేదు. మణికేశ్వరం, తిమ్మారెడ్డిపాలెంల పునరావాస కాలనీలలో మౌలిక వసతుల కల్పన జరగకపోవటంతో ఇంకా ప్రజలు పునరావాస కాలనీలకు వెళ్లలేదు. శ్మశాన స్థలాల కేటాయింపు కూడా జరగలేదు. దశాబ్దంన్నర క్రితం పునరావాస కాలనీలకు వచ్చిన వేణుగోపాలపురంలో వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాల నిర్మాణ పనులు పూర్తి కాక పోవటంతో బాలాలయం లోనే దశాబ్దాల తరబడి పూజలు నిర్వహిస్తున్నారు. ధేనువకొండ పునరావాస కాలనీలోని కాశీవిశ్వేశరస్వామి, వీరభద్ర స్వామి తదితర దేవాలయాల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. తిమ్మారెడ్డిపాలెం, మణికేశ్వరం పునరావాస కాలనీలలో కూడా దేవాలయాల నిర్మాణ పనులు పూర్తి కాలేదు. ఇలా అన్ని సమస్యలతో పునరావాస కాలనీల ప్రజలు కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


వేణుగోపాలపురం లో పూర్తి కాని వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాలు


తిమ్మారెడ్డిపాలెం పునరావాస కాలనీలో నిర్మాణంలో ఉన్న దేవాలయం

అసత్య కథనాలపై పొగాకు రైతుల నిరసన

యద్దనపూడి,(మార్టూరు)జూలై17(ఆంధ్రజ్యోతి):పొగాకు రైతుల కోసం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయించిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు కృషిని రైతులు అభినందిస్తుంటే దానిని చూసి ఓర్వలేని జగన్ పత్రిక రెండు రోజులు నుంచి అసత్య కథనాలను ప్రచురించడంపై గురువారం యద్దనపూడి మండలంలోని పొగాకు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో దాదాపుగా 2 వేల మంది రైతులు పొగాకు పంటను సాగు చేసి లక్షా 15 వేలకు పైగా క్వింటాళ్ల దిగుబడి సాధించారు.అయితే పండించిన పొగాకును అమ్ముకోలేక,కొనే నాథుడే లేక రైతు కుటుంబాలు మానసికంగా కుంగిపోతున్న తరుణంలోఎమ్మెల్యే ఏలూరి పర్చూరు మండలంలోని అడుసుమల్లిలో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయించారు. కానీ రాజకీయకక్షతో రైతుల మధ్య ఐకమత్యాన్ని దెబ్బతీసే విధంగా, పొగాకు రైతులను అయోమయానికి గురిచేసే విధంగా తప్పుడు కథనాలను ప్రచురించిన జగన్ పత్రికపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లపనేని రంగయ్య చౌదరి, బోయపాటి సాంబ శివరావు, రావిపాటి సీతయ్య, అమ్మినేని వెంకటేశ్వర్లు, గుదే తారక రామారావు తదితరులు పాల్గొన్నారు.


అడుసుమల్లిలో పొగాకు కొనుగోలు కేంద్రంవద్ద నిరసన తెలుపుతున్న యద్దనపూడి మండల పొగాకు రైతులు

చౌకబారు కుట్రలకు పాల్పడితే ఉపేక్షించం

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
- కష్టాల్లో ఉన్న నల్లబర్లీ రైతులను ఆదుకున్న ప్రభుత్వం



పర్చూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జగన్ పత్రిక తప్పుడు వార్తలను ప్రచురించి చౌకబారు కుట్రలకు పాల్పడుతోందని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొగాకు రైతులపై ఎందుకీ పగ అనే శీర్షికతో ప్రచురితమైన ఏలూరి స్పందించారు. కష్టాల్లో ఉన్న బర్లీ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేస్తుంటే వారి ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా కథనాన్ని రాశారని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు కథనాల వల్ల రైతులు మానసికంగా కుంగిపోతారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాహసోపేత నిర్ణయం తీసుకొని బర్లీ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేపట్టారని పేర్కొన్నారు. మూడు నెలల పాటు నిర్విరామంగా కొనుగోలు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని గుర్తుచేశారు. రాజకీయ స్వార్థంతో తప్పుడు కథనాలు ప్రచురించటం తగదన్నారు.


జగన్, భారతికి రైతులు సంతకాలు చేసి రాసిన బహిరంగ లేఖ

జగన్, భారతికి బర్లీ రైతుల బహిరంగ లేక

పర్చూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రైతుల మనో భావాలను దెబ్బతేసే విధంగా జగన్ పత్రిలో ప్రచురితమైన వార్త కథనానికి సంబంధించి వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి, సాక్షి దినపత్రిక చైర్ పర్సన్ వైఎస్ భారతికి పర్చూరు నియోజవర్గ బర్లీ రైతులు గురువారం బహిరంగ లేఖ రాశారు. లేఖ సారాంశం ఇలా...వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తున్న కర్షకులం,... మేము పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేక ఆందోళనలో మునిగిన తరుణంలో ప్రభుత్వం మా ఇబ్బందులను గుర్తించి, మా కష్టాలను తీర్చేందుకు ప్రత్యక్షంగా మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆదుకుంది. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా రైతుల వద్ద నుంచి పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న తరుణంలో మా ఆత్మస్థైర్యాన్ని దెబ్బతేసే విధంగా మీ పత్రికలో అసత్య వార్తలు రాస్తూ మా మనో ధైర్యాన్ని దెబ్బతీస్తున్నారు అంటూ 50 మంది రైతులు సంతకాలతో కూడిన బహిరంగ లేఖను రాశారు.

ఎరువులు, విత్తనాల షాపులలో తనిఖీలు

అద్దంకిటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): అద్దంకిలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపులలో గురువారం వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆయా షాపులలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను పరిశీలించడంతో పాటు వాటికి సంబంధించిన బిల్లులు, పుస్తకాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఏడీ ఏ. శ్రీనివాసరావు మాట్లాడుతు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల షాపులలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. దానిలో భాగంగానే అద్దంకిలోని షాపలను తనిఖీ చేశామని, అన్నీ సక్రమంగా ఉన్నాయని తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్, అద్దంకి డివిజన్ ఏడీఏ ఎఫ్రాయిమ్, బాపట్ల టెక్నికల్ ఏవో మోహనరెడ్డిలు ఉన్నారు.


అద్దంకిలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

యూరియా అమ్మకాల నిలిపివేత

మార్టూరు, జూలై17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలలపూడి, మార్టూరు గ్రామాలలోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్, వ్యవసాయ శాఖ స్క్వాడ్ అధికారులు గురువారం తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా కోలలపూడి గ్రామంలోని వీఎస్ఆర్ సీడ్స్ షాపులో తనిఖీలు చేయగా యూరియా ఎరువుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో వాటి అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశించారు. అదేవిధంగా పోస్టల్ సీడ్స్ షాపులో మూడు మిరప విత్తనాల నమూనాలను సేకరించి వాటిని ల్యాబ్‌కు పంపిస్తున్నామన్నారు. అలాగే మార్టూరులో కోస్టల్ హైబ్రిడ్ సీడ్స్ దుకాణంలో తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా మైలవరం ఏడీఏ శ్రీనివాసరావు, విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్, మండల వ్యవసాయఅధికారిణి లావణ్య తదితరులు పాల్గొన్నారు.


కోలలపూడిలోని ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

చినగంజాం ఎంపీడీవోగా విజయ

చినగంజాం, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా ఎస్.విజయ గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా దోర్నాల ఎంపీడీవోగా పనిచేస్తూ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఇక్కడకు వచ్చారు. పూర్తి అదనపు బాధ్యతలతో ఇక్కడ పనిచేస్తున్న ఇంకొల్లు ఎంపీడీవో జి.శ్రీనివాసనావు స్థానంలో బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇన్‌చార్జ్ ఎంపీడీవో విజయను కార్యాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

ఇంకొల్లు,జూలై 17,(ఆంధ్రజ్యోతి) : మొక్కలను పెంచడంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని ఇంకొల్లు ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షుడు కరి అమ్మయ్యచౌదరి అన్నారు.గురువారం ఇంకొల్లులోని కొణికి రోడ్డులో 30 కదంబ మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో ది ఇంకొల్లు ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి మాగులూరి రవీంద్ర, సభ్యులు కరణం పున్నయ్యచౌదరి,పంగులూరి హనుమయ్య,శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన మార్కెట్ యార్డు వైస్ చైర్మన్

బల్లికురవ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న దేవినేని నరేంద్ర గురువారం బాపట్లలో ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్‌ను కలిశారు. ఈసందర్భంగా వైస్ చైర్మన్‌కు ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు. ఆనంతరం ఎంపీకి దేవినేని నరేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌యార్డు అభివృద్ధికి చేయూత ఇవ్వాలని విన్నవించారు. అలానే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులు మంజురు అయ్యేలా కృషి చేస్తానని వైస్ చైర్మన్ ఈసందర్భంగా ఎంపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వసంత వేణుబాబు, అమరనేని వినోద్ తదితరులు ఉన్నారు.


ఎంపీ కృష్ణప్రసాద్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ దేవినేని నరేంద్ర

ఘనంగా కారంచేడు మృత వీరుల సంస్మరణ సభ

విజయనగర్‌కాలనీ(చీరాల), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : దేశానికి స్వాతంత్ర్యం ఎలాంటిదో దళితులకు కారంచేడు ఉద్యమం అటువంటిదని పలు దళిత, బహుజన, ప్రజా సంఘాల నేతలు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని విజయనగర్ కాలనీ రుధిర క్షేత్రం వద్ద కారంచేడు మృత వీరుల 40వ సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు సంఘాల నేతలు హాజరయి రుధిర క్షేత్రంలో ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఆల్ ఇండియా బీఎస్పీ అధ్యక్షురాలు బక్కా పరంజ్యోతి, ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు, బీఎస్పీ మాజీ ఎమ్మెల్యే రాజారావు, నాయకులు దుడ్డు భాస్కరరావు, సుబ్బారావు, ప్రసాద్, దేవదానం, ఏసుపాదం, లక్ష్మీ నరసయ్య, బలహీన వర్గాల సమాఖ్య ప్రతినిధి గోసాల ఆశీర్వాదం, మాల మహానాడు ప్రతినిధులు శబూలం రోజన్‌బాబు, రాజారావు పాల్గొన్నారు.


అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న పలు సంఘాల నాయకులు